ఎన్నికల హామీల అమలుతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పోలవరం, అమరావతి, రైల్వేలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోంది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 09.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 78 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# బుసాన్‌లో పెట్టుబడుల వేట

## నారా లోకేష్ బుసాన్ పర్యటనలో వరుస పెట్టుబడి చర్చలు

- ఫైనాన్స్ నుంచి ఫుట్‌వేర్ వరకు... షిప్‌బిల్డింగ్ నుంచి సెమీకండక్టర్ల వరకు ఏపీపై దృష్టి
- పరిశ్రమల విస్తరణకు కొత్త భాగస్వామ్యాల దిశగా అడుగులు





**బుసాన్ (సౌత్ కొరియా):** బిఎన్ కె ఫైనాన్షియల్ గ్రూప్ ఎండీ లీ క్వాంగ్ జున్, బిఎన్ కె క్యాపిటల్ సీఈవో సన్ డే జిన్, మేక్ ఇన్ ఇండియా కొరియా ఛైర్మన్ జంగ్ డియోక్ మిన్, ఎస్ బీసన్ బో కంపెనీ ఛైర్మన్ డా. క్యూమ్ సిక్, హ్యుందయ్ మోటార్స్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ కోఆపరేషన్) చోయ్ సియుంగ్ హూన్‌లతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బుసాన్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పెట్టుబడులు, నిధుల నిర్వహణ, కన్సల్టింగ్ సేవల ద్వారా స్టార్టప్ లు, ఎస్ఎంఈలకు మద్దతు ఇచ్చేందుకు బిఎన్ కె వెంచర్ క్యాపిటల్ సంస్థ.. ఏపీలోని ఆర్ టీఐహెచ్ లో మెంబర్/మెంటర్ గా చేరాల్సిందిగా ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి ప్రాజెక్టులైన అమరావతి, పారిశ్రామిక పార్కులు, విద్యుత్ మౌలిక సదుపాయాలు మొదలైన వాటికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్ అందించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మాణం, ఇంధన పరిశ్రమలకు చెందిన క్లయింట్‌లను వారి పెట్టుబడి/ఉత్పత్తి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న అమరావతిలో BNK ఫైనాన్షియల్ శాఖను

మిగతా 2లో...

### బుసాన్‌లో 'అపెక్స్'... ఏపీకి 'యాక్సెస్'!

- కొరియా సంస్థలకు ఏపీ మరింత చేరువ
- పెట్టుబడిదారులకు సహకారం, సమన్వయానికి ప్రత్యేక వేదిక
- పారిశ్రామిక భాగస్వామ్యాలకు కొత్త అధ్యాయం

2 లో

### కొరియా అడుగు... ఏపీకి ఉపాధి వెలుగు!

- బుసాన్‌లో బూ యంగ్ గ్రూప్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ
- పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటుకు ఆహ్వానం
- పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలకు కొత్త అడుగుల సంకేతాలు

• వివరాలు 2 లో


### తూర్పుతీరానికి ఏపీనే మారిటైమ్ గేట్‌వే!

- దుగరాజపట్నం క్లస్టర్‌లో పెట్టుబడులకు ప్రపంచ కంపెనీలకు ఆహ్వానం
- షిప్‌బిల్డింగ్, మెరైన్ తయారీ రంగాలకు సిద్ధమైన మౌలిక వసతులు

• వివరాలు 2 లో

# తెనాలిలో నేడు గుమ్మడి శతజయంతి వేడుకలు

## ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహణ



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ సినీ నటుడు డా. గుమ్మడి వెంకటేశ్వరరావు శతజయంతి వేడుకలు గురువారం సాయంత్రం 6.30 గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించనున్నారు.

వేడుకలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి హాజరుకానున్నారు. అలాగే శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితర ప్రముఖులు పాల్గొననున్నారు. గుమ్మడి వెంకటేశ్వరరావు తెలుగు సినీ రంగానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఆయన జీవితం, నటనా ప్రస్థానాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సినీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# హస్త కళాకారులకు ఆరోగ్య భరోసా

- ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో నరసాపురం, శ్రీకాళహస్తిలో వైద్య శిబిరాలు
- హస్తకళాకారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు
- ఇచ్చిన మాట 24 గంటల్లో నిలుపుకొన్న పవన్ కళ్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఇచ్చిన మాటను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ మరుసటి రోజే ఆచరణలో పెట్టారు. పవన్ కళ్యాణ్ సూచనతో హస్త కళాకారుల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే విధంగా క్లస్టర్ల వారీగా వైద్య శిబిరాలు ప్రారంభం అయ్యాయి. బుధవారం నరసాపురం లేస్ కళాకారులు, శ్రీకాళహస్తి కలంకారీ కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. నరసాపురంలో 105 మంది లేస్ కళాకారులకు పరీక్షలు నిర్వహించగా, 37 మందికి కంటి సంబంధిత సమస్యలు ఉన్నట్టు నిర్ధారించారు. అందులో 16 మందికి కళ్లలో శుక్లాలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు.

మిగతా 2లో...



## హాస్టళ్లు కాదు...

# ఇక గురుకులాలే!

- 10% డైట్ ఛార్జీల పెంపు.. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే అమలు
- రూ.100 కోట్లతో మరమ్మత్తులు.. మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు
- సంక్షేమ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఇస్తున్న డైట్ ఛార్జీల్లో 10 శాతం పెంచాలని ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్ష సందర్భంగా విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని.. వచ్చే ఏడాది నుంచి పెంచుదామని ఆర్థిక శాఖ అధికారులు సూచించినా... ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపజేయాలని సీఎం స్పష్టం చేశారు. బలహీనవర్గాల విద్యార్థుల కోసం డైట్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుంది. దీనికి తగినట్టుగానే వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించాలి. మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకే డైట్ ఛార్జీలు పెంచుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లబ్ధి చేకూర్చే విషయంలో వారికి కలిగే ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకోవాలి' అని సీఎం చంద్రబాబు అన్నారు.

మిగతా 2లో...

# చికిత్స నిష్ప్రయోజనమైన రోగులకు గౌరవప్రదమైన వీడ్కోలు!

- కారుణ్య మరణంపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల
- అంతిమ దశ రోగులకు గౌరవప్రదమైన మరణంపై ప్రభుత్వం మానవీయ నిర్ణయం
- వెంటిలేటర్‌పై అంతులేని బాధకు ముగింపు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో కారుణ్య మరణానికి చట్టబద్ధ విధానం
- వైద్యపరంగా జీవించే ఆశ లేనప్పుడు... గౌరవప్రదమైన మరణానికి అవకాశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తీవ్ర వ్యాధులతో బాధపడుతూ, చికిత్సకు ఏమాత్రం స్పందించని స్థితిలో వెంటిలేటర్ వంటి లైఫ్ సపోర్ట్ వ్యవస్థలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తూ నరకయాతన అనుభవిస్తున్న అంతిమదశ రోగులకు గౌరవప్రదమైన ముగింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా కారుణ్య మరణం (ప్యాసివ్ యూతనేషియా) అమలుకు సమగ్ర విధివిధానాలు, మార్గదర్శకాలను రూపొందించింది. సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఈ మార్గదర్శకాలకు ఆమోదం తెలిపారు. దీంతో కోలుకునే అవకాశం లేని రోగులకు అవసరం లేని చికిత్సలతో బాధను మరింత పొడిగించకుండా, చట్టబద్ధంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడింది.


**గౌరవప్రదమైన మరణం కూడా ప్రాథమిక హక్కే :** భారత రాజ్యాంగంలోని 21వ అధికరణ ప్రకారం జీవించే హక్కుతో పాటు గౌరవప్రదమైన మరణం కూడా పౌరుల ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2018లో కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ఇచ్చిన చారిత్రక తీర్పులో కారుణ్య మరణానికి అనుమతి ఇచ్చిన అత్యున్నత న్యాయస్థానం, 2023 జనవరిలో ఆ తీర్పులో మరికొన్ని సవరణలు చేసింది. వాటి ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ మార్గదర్శకాలను రూపొందించింది.

**ఇప్పటివరకు ఎదురైన చట్టపరమైన చిక్కులు :** ఇంతకుముందు

మిగతా 2లో...



మార్గదర్శకాలను ఆమోదించిన వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

డా॥ గుమ్మడి వెంకటేశ్వరరావు గారి శతజయంతి వేడుక ప్రారంభసభకు విచ్చేయుచున్న శ్రీమతి నారా భువనేశ్వరి గారికి స్వాగతం- సుస్వాగతం

తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ

## హస్త కళాకారులకు ఆరోగ్య భరోసా



(మొదటి పేజీ తరువాయి)

అవసరం అయిన వారికి వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో శస్త్ర చికిత్స చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నపాటి దృష్టి దోష సమస్యలు ఉన్న 21 మందికి కళ్లజోళ్లు వేయించే ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తిలో మొత్తం 53 మంది హస్తకళాకారులకి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక పరీక్షలతో పాటు అన్ని రకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

**శ్రీమతి మహాలక్ష్మికి శంకర నేత్రాలయలో పరీక్షలు :** హస్తకళా మహోత్సవం సందర్భంగా నరసాపురం నియోజకవర్గం, పసలదీవికి చెందిన లేస్ కళాకారిణి మహాలక్ష్మి తమకు నేత్ర సంబంధిత ఇబ్బందులు వస్తున్నాయన్న విషయాన్ని ఉప ముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం మహాలక్ష్మితోపాటు అందే లక్ష్మి అనే మరో లేస్ కళాకారిణిని పవన్ కళ్యాణ్ ప్రత్యేక వాహనంలో పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రికి పిలిపించి పరీక్షలు చేయించారు. ఇరువురికీ దృష్టి దోష సమస్యలు ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. కళ్లజోళ్లు, ఐ డ్రాప్స్, మందులు ఇప్పించి పంపారు.

## బుసాన్‌లో పెట్టుబడుల వేట

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు.

బిఎన్ కె ఫైనాన్షియల్ గ్రూప్ ఎండీ లీ క్వాంగ్ జున్, బిఎన్ కె క్యాపిటల్ సీఈవో సన్ డే జిన్ మాట్లాడుతూ.. బిఎన్ కె ఫైనాన్షియల్ గ్రూప్ లో మూడు బ్యాంకులు (బుసాన్, క్యోంగ్నామ్, సేవింగ్స్), బీఎన్‌కే సెక్యూరిటీస్, క్యాపిటల్, అసెట్ మేనేజ్‌మెంట్, క్రెడిట్ ఇన్ఫర్మేషన్, సిస్టమ్, వెంచర్ క్యాపిటల్ అంతర్భాగాలుగా ఉన్నాయని చెప్పారు. కొరియాలో 398 దేశీయ శాఖలు, చైనా, భారత్, ఆగ్నేయ/మధ్య ఆసియాలలో 75అవుట్ లెట్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. (దక్షిణ కొరియాలోని మూడు ప్రాంతీయ ఫైనాన్షియల్ హోల్డింగ్ గ్రూపులలో ఒకటిగా ఉన్న బిఎన్ కె ఫైనాన్షియల్ గ్రూప్ ఏకీకృత ఆస్తులు ₩101.9 బిలియన్లు (రూ. 9.64 లక్షల కోట్లుగా ఉన్నాయి.)

## బుసాన్‌లో 'అపెక్స్'... ఏపీకి 'యాక్సెస్'!



**బుసాన్ (సౌత్ కొరియా):** దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్ లో ఏపీఈడీబీ ఆధ్వర్యాన అపెక్స్ – కొరియా పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగంను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ ప్రారంభించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తిచూపే కొరియా సంస్థలకు, ఏపీ ప్రభుత్వానికి మధ్య అపెక్స్ కొరియా అనుసంధానకర్తగా పనిచేస్తుందని మంత్రి లోకేష్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటుచేసిన సంస్థలకు అవసరమైన సేవలను కూడా అపెక్స్ కొరియా అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీఈడీబీ సీఈవో సగిలి షన్మోహన్, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, పరిశ్రమలశాఖ కమిషనర్ శుభం బన్సాల్, దక్షిణకొరియాకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అభినందనలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నూతనంగా రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన విద్యావేత్త భాష్యం రామకృష్ణను నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా టెట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్ట సవరణ చేపట్టేలా కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టెట్ పరీక్షలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు కేటగిరీలతో సంబంధం లేకుండా ఒకే విధమైన క్వాలిఫైయింగ్ మార్కులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించిన భాష్యం రామకృష్ణ రాజ్యసభకు ఎంపిక కావడం ఉపాధ్యాయ లోకానికి గర్వకారణమని అన్నారు. జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన సమర్థంగా కృషి చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సంక్షేమం, టెట్ చట్ట సవరణ, గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలు, ఉద్యోగుల విభజన వంటి అంశాలపై కృషి చేస్తానని భాష్యం రామకృష్ణ హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను సంఘం నాయకులు శాలువా, పూల బొకేతో సత్కరించారు.

## సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరిహారం అందజేత

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖ చేపలరేవు నుంచి వేటకు వెళ్లి, సముద్ర జలాల్లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు, సురక్షితంగా తిరిగివచ్చిన కారి చిన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ప్రకటించిన పరిహారం చెక్కులను బుధవారం చేపలరేవులోని బోటు ఆపరేటర్ల సంఘం కార్యాలయంలో మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మత్స్యశాఖ నుంచి రూ.5 లక్షలు, సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలు కలిపి ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేశామని తెలిపారు.

# హాస్టళ్లు కాదు... ఇక గురుకులాలే!

(మొదటి పేజీ తరువాయి)



**కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలు :** సంక్షేమ శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకులాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని వ్యాఖ్యానించారు. 'హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం చేపట్టేందుకు పెద్దపీట వేయాలి. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో నెట్‌జీరో విధానాన్ని అమలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో విశ్లేషించాలి. బయో డైవర్శిటీ పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించాలి. మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలతో గురుకులాలను నిర్మిద్దాం. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ ఇవ్వాలి. దీని నిమిత్తం రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం. హాస్టళ్లు, గురుకులాల్లో చదివే విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇప్పించాలి. పోటీ పరీక్షలకు గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థులను సిద్ధం చేయాలి. విద్యతో సమానంగా శిక్షణ అందించాలి. బెస్ట్ టీచర్స్ నియమించి క్వాలిటీ ట్రైనింగివ్వాలి. హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటూ ప్రతిభ కనబరిచే ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ప్రారంభించండి. ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను మ్యాపింగ్ చేసి... నైపుణ్యం పెంచి పారిశ్రామిక అవసరాలకు వర్క్‌ఫోర్స్ సిద్ధం చేయాలి. హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఓ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలి. సంక్షేమ హాస్టళ్లను ఎన్ఆర్ఐలు అడాప్ట్ చేసుకునేలా వారితో సంప్రదింపులు జరపాలి. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల నెట్ వర్కింగ్ చేయాలి. రెసిడెన్షిల్ స్కూళ్లు, గురుకులాల్లో స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి విద్యా, వైద్య సేవలు అందించే వాళ్లకి అవకాశం కల్పించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**పథకాల లబ్ధి పేదలకు అందాలి :** "పేదలు, బలహీన వర్గాలకు సంక్షేమం అందించడమే కాదు... వారి జీవనోపాధిని మెరుగు పరిచి... మరింత ఆదాయాలు సమకూర్చేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలి. ప్రభుత్వం వైపు నుంచి అందించే సంక్షేమం, మెప్మా, డ్వాక్రా పథకాల ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు... పీ4 ద్వారా సాయం అందాలి. వ్యవసాయం, ఉద్యానరంగం, పాడి పరిశ్రమ, జీ రామ్ జీ సహా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు చేకూర్చాలి. సాస్కీ, పూర్వోదయ, జీ రామ్ జీ వంటి పథకాల లబ్ధి బడుగు వర్గాలకు దక్కేలా చూడాలి. ఉద్యాన, రబ్బర్, కాఫీ, పసుపు వంటి పంటల సాగును ప్రోత్సహించి ఆ వర్గాల రైతులకు లబ్ధి కలిగేలా చూడాలి. ఇప్పటికే కొన్ని విధానాల ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగు పరిచేలా పాలసీలు తీసుకున్నాం. లిక్కర్ షాపుల్లో కల్లుగీత వృత్తిదారులకు, క్వారీల్లో వడ్డెర్లకు కోటా పెట్టాం. నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఇలా వివిధ వర్గాలకు ఆర్థికంగా సాయం చేస్తున్నాం. ప్రభుత్వ పరంగా అందించే సాయమే కాకుండా... వారి అభివృద్ధికి ఏమేం చర్యలు తీసుకోవానే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి. ఈ మేరకు వివిధ కుల కార్పొరేషన్ల బై లాస్ మార్చే అంశాన్ని పరిశీలించండి. బ్రాహ్మణ కార్పొరేషన్ విధానాలను మిగిలిన కార్పొరేషన్లు కూడా అవలంభించేలా చర్యలు తీసుకోవాలి. జీ రామ్ జీ ద్వారా అంగన్వాడీ భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. ఈ సమీక్ష సందర్భంగా సంక్షేమ శాఖల్లో తాము తీసుకున్న చర్యలను మంత్రులు, అధికారులు వివరించారు. కొందరు విద్యార్థులు హోం సిక్‌కు గురవుతున్నారని.. అలాంటి విద్యార్థుల కోసం తల్లిదండ్రులతో మాట్లాడేలా స్మార్ట్ కార్డ్ బేస్డ్ టెలీఫోన్ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు.

తల్లిదండ్రులతో రోజులో 4 నిమిషాలు మాట్లాడుకునే సదుపాయం కల్పించామని తెలిపారు. సాస్కి కింద సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో రూ.120 కోట్లతో ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్స్ సహా ఇతర మౌలిక వసతులను కల్పించే పనులు చేపట్టామని వివరించారు. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు పూర్తి చేశామని... ఈ నెలాఖరు నాటికి టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేస్తామని సీఎంకు అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు డీబీవీ స్వామి, సవిత, సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ సంక్షేమ సలహాదారు మహ్మద్ షరీఫ్ సహా వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## తూర్పుతీరానికి ఏపీనే మారిటైమ్ గేట్‌వే!



**బుసాన్ (సౌత్ కొరియా):** భారత తూర్పుతీరంలో మారిటైమ్ వ్యాపారానికి ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమైన ప్రాంతం. 1053 కి.మీ.ల సుదూర తీరప్రాంతం కలిగి ఉంది. ఒక మేజర్, 5 నాన్ మేజర్ ఆపరేషనల్ పోర్టుల ద్వారా ప్రతిఏటా 330 మిలియన్ టన్నులకు పైగా సరుకుల రవాణా జరుగుతోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. కొరియా మెరైన్ ఎక్విప్ మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుసాన్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఏపీలో మరో 4 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి. 1.10 లక్షల ఎకరాలకు పైగా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్ ఏపీలో అందుబాటులో ఉంది. ప్రతి 50 కి.మీ.లకు ఒక ఓడరేవు/షిప్ యార్డ్/ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. భారత్ లో మొట్టమొదటి స్టేట్ అప్రూవ్డ్ షిప్ బిల్డింగ్ క్లస్టర్ దుగరాజపట్నంలో రూ.30వేల కోట్లతో 3,488 ఎకరాల్లో నిర్మితమవుతోంది. దీనిని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సంయుక్తంగా విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ)లో అభివృద్ధి చేస్తున్న ఈ క్లస్టర్ శ్రీసిటీ, కృష్ణపట్నం పోర్టులకు సమీపంలో ఉండటంతోపాటు కనెక్టివిటీ కలిగి ఉంది. భారతీయ ఎగుమతి మార్కెట్ల కోసం కొరియన్ పరికరాలను స్థానికీకరించడానికి, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు, ఉమ్మడి సౌకర్యాల ఏర్పాటుకు కొరియా మెరైన్ ఎక్విప్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతున్నాం. దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ క్లస్టర్ లో టెస్టింగ్/సర్టిఫికేషన్ ల్యాబ్ లతో పాటు ఇంజన్లు, ప్రొపల్షన్, నావిగేషన్, డెక్ మెషినరీ, ఎలక్ట్రికల్స్, అవుట్‌ఫిట్టింగ్, ప్రత్యేక మెరైన్ పరికరాల తయారీ, అనుబంధ పార్కును ఏర్పాటు చేయాల్సిందిగా ఖూవీజూా సభ్యులను స్వాగతిస్తున్నట్లు లోకేష్ పేర్కొన్నారు.

భారతదేశంలో సుమారు ₩12.3 బిలియన్ల నౌకా నిర్మాణ ఆర్డర్లు ఉన్నాయి. ఇప్పటికీ 93% అంతర్జాతీయ సరుకు రవాణా విదేశీ నౌకల ద్వారానే జరుగుతోంది. తీరప్రాంత నౌకలలో 50% 20 ఏళ్లకు పైబడినవి, MoPNG పరిధిలోని 112 నౌకలు, విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో నౌకల మరమ్మతులకు డిమాండ్ ఉంది. భారత ప్రభుత్వం రూ.70వేల కోట్ల మారిటైమ్ ప్యాకేజీ ప్రకటించింది. ఇందులో భాగంగా ఒక్కొక్క నౌకా నిర్మాణానికి 15నుంచి 25 శాతం ఆర్థిక సాయం అందుతోంది. రూ.25వేల కోట్ల మారిటైమ్ డెవలప్ మెంట్ ఫండ్ ద్వారా కొత్త యార్డులకు మూలధన వ్యయంలో 25శాతం వం-కు గ్రాంట్ల రూపంలో అందుతోంది. నౌకా నిర్మాణానికి మౌలిక సదుపాయాల హోదా లభిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలను చేతల్లో అమలు చేసి చూపిస్తున్నాం. కియా (₩2 బిలియన్లు, సుమారు 24 నెలల్లో ట్రయల్ ప్రొడక్షన్), ఎల్జీ ఎలక్ట్రానిక్స్ (శ్రీసిటీ, ఒక సంవత్సరంలోపే శంకుస్థాపన), ాావీ/చీూ (₩15.3 బిలియన్లు, 17 నెలల్లో శంకుస్థాపన) ప్రాజెక్టులు ఇందుకు నిదర్శనం. కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో పనిచేస్తున్నాయి, చెన్నై రీజియన్ లో మరో 50 కంపెనీల వరకు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక కొరియా మెరైన్ ఎక్విప్ మెంట్ డెస్క్, ఇండియా షిప్ టెక్నాలజీ సెంటర్, ఉమ్మడి నైపుణ్య శిక్షణ, ఆర్ ఒ డీ సంస్థల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు (ూావీదీ)తో భాగస్వామ్యం వహించాల్సిందిగా కొరియా మెరైన్ ఎక్విప్ మెంట్ అసోసియేషన్ (ఖూవీజూా) ప్రతినిధులకు మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో హాన్వా ఐఎంస్, హ్యుందయ్ వెల్డింగ్, డేసన్ షిప్ యార్డు, సన్ బో ఇండస్ట్రీస్, ఓరియంటల్ ప్రెసిషన్ ఒ ఇంజనీరింగ్, ఫైన్ కొరియా, జేవో ఇంజనీరింగ్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొరియా అడుగు... ఏపీకి ఉపాధి వెలుగు!



**బుసాన్ (సౌత్ కొరియా):** పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈవో ఒ ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ ఒ ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బుసాన్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బూ యంగ్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్ కి వస్తే సింగిల్ విండో విధానంలో అనుమతులతోపాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అమలు చేస్తున్నామని అన్నారు. బూ యంగ్ గ్రూప్ సీఈవో ర్యాన్ కాంగ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో బూ యంగ్ పాదరక్షల తయారీ, విడిభాగాల యూనిట్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేస్తూ, రెడీ బిల్ట్ షెడ్ల కోసం అన్వేషిస్తున్నట్లు చెప్పారు. స్కైకార్ప్ గ్రూప్ అంతర్భాగంగా ఉన్న తమ సంస్థ అంతర్జాతీయ నెట్ వర్క్ తోపాటు 4,300 గ్లోబల్ కస్టమర్లు, 1.10లక్షలకుపైగా అంతర్జాతీయ షిప్ మెంట్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. తమకున్న గ్లోబల్ నెట్ వర్క్ భారతీయ తయారీరంగాన్ని ప్రపంచ పంపిణీ వ్యవస్థతో అనుసంధానిస్తుందని అన్నారు.

## కుల వృత్తుదారులకు ఆధునిక పరికరాలు



- **మంత్రులు డోలా బాలవీరంజనేయ స్వామి, సవిత**
- **రాష్ట్ర సచివాలయంలో లిడ్ క్యాప్ అవుట్ ప్రారంభించిన మంత్రులు**
- **10 శాతం డిసౌంట్లపై ఉద్యోగులకు లెదర్ ఉత్పత్తుల అమ్మకాలు**
- **లెదర్ ఉత్పత్తులు కొనుగోలు చేసిన మంత్రులు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కుల వృత్తుదారులకు ఆర్థిక భరోసా కల్పించేలా ఆధునిక పరికరాలను కూటమి ప్రభుత్వం అందజేస్తోందని మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, సవిత తెలిపారు. చర్మకారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక దృష్టిసారించామన్నారు. వెలగపూడి సచివాలయంలోని నాలుగో బ్లాక్ లో లిడ్ క్యాప్ లెదర్ షోరూమ్ ను =మంత్రులు డిఎస్ బీవీ స్వామి, సవిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా మంత్రులు విలేకరులతో మాట్లాడారు. లెడ్ క్యాప్ ద్వారా చర్మకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి బాలవీరాంజనేయస్వామి తెలిపారు. చర్మకారులకు ఉపాధి కల్పనకు మార్కాపురం జిల్లా యడవల్లి, కృష్ణాజిల్లా జి. కొండూరులో లెదర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లిడ్ క్యాప్ కి పూర్వవైభవం తీసుకొస్తున్నామన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ, కుల వృత్తిదారులకు ఏడాది పాటు ఉపాధి కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాశ్వత ఉపాధితో పాటు ఆర్థిక భరోసా కలిగేలా కుల వృత్తిదారులకు ఆధునిక పరికరాలు అందజేస్తున్నామన్నారు. సచివాలయంలో లెడ్ క్యాప్ అవుట్ లెట్ ఏర్పాటుతో నాణ్యమైన లెదర్ ఉత్పత్తులు సచివాలయ ఉద్యోగులకు, సందర్శకులకు లభించే అవకాశం కలిగిందన్నారు. పది శాతం డిస్కౌంట్లపై సచివాలయ సిబ్బంది లెదర్ ఉత్పత్తులు విక్రయిస్తారన్నారు. లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాల వరప్రసాద్ రావు మాట్లాడుతూ, చర్మకారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైసీపీ కబ్జా కోరుల నుంచి లిడ్ క్యాప్ సంస్థ భూముల్ని కాపాడామన్నారు.

**లెదర్ ఉత్పత్తులు మంత్రులు కొనుగోలు :** సచివాలయంలో లిడ్ క్యాప్ అవుట్ లెట్ ప్రారంభం సందర్భంగా మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, సవిత లెదర్ ఉత్పత్తులు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ ఎండీ ప్రసన్న వెంకటేశ్, కార్యదర్శి ఎంఎం నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స నిష్ప్రయోజనమైన రోగులకు గౌరవప్రదమైన వీడ్కోలు !

(మొదటి పేజీ తరువాయి)



చికిత్సకు పూర్తిగా లొంగని, కోలుకునే అవకాశం లేని రోగులకు వెంటిలేటర్ వంటి లైఫ్ సపోర్ట్ వ్యవస్థలను తొలగించేందుకు స్పష్టమైన చట్టపరమైన నిబంధనలు లేకపోవడంతో వైద్యులు, ఆసుపత్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర సందిగ్ధ పరిస్థితులను ఎదుర్కొనేవారు. రోగి పరిస్థితి తిరిగి మెరుగుపడదని తెలిసినా చట్టపరమైన భయంతో చికిత్స కొనసాగించాల్సి వచ్చేది. దీనివల్ల రోగులు దీర్ఘకాలం తీవ్ర వేదనను అనుభవించడమే కాకుండా కుటుంబాలు కూడా మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవి.

**రోగి స్వయం నిర్ణయానికి చట్టబద్ధ గుర్తింపు :** కొత్త మార్గదర్శకాల ప్రకారం రోగి పూర్తి స్పృహలో ఉండి, ఎలాంటి ఒత్తిడి లేకుండా భవిష్యత్తులో తనకు అందించాల్సిన వైద్యం గురించి ముందుగానే నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం ఇద్దరు సాక్షుల సమక్షంలో 'అడ్వాన్స్ డైరెక్టివ్' రూపొందించవచ్చు. ఇందులో తన తరపున నిర్ణయాలు తీసుకునే గార్డియన్‌ను కూడా పేర్కొనవచ్చు. ఈ పత్రాన్ని నోటరీ లేదా గెజిటెడ్ అధికారి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇది రోగి స్వయం నిర్ణయాధికారానికి చట్టబద్ధ రక్షణ కల్పించే కీలక అంశంగా ప్రభుత్వం పేర్కొంది.

**రెండు దశల్లో వైద్య నిపుణుల పరిశీలన :** రోగి పరిస్థితి చికిత్సకు లొంగదని భావించినప్పుడు చికిత్స అందిస్తున్న వైద్యుడు రోగి అడ్వాన్స్ డైరెక్టివ్‌లో పేర్కొన్న గార్డియన్‌కు పూర్తి వివరాలు తెలియజేస్తాడు. అనంతరం ఆసుపత్రి ప్రైమరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేస్తుంది. ఇందులో చికిత్స చేస్తున్న వైద్యుడితో పాటు కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న మరో ఇద్దరు వైద్యులు ఉంటారు. ఈ బోర్డు 48 గంటల్లో రోగి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇస్తుంది.

ప్రైమరీ మెడికల్ బోర్డు చికిత్స కొనసాగించడం ప్రయోజనం లేదని నిర్ణయిస్తే, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆధ్వర్యంలో సెకండరీ మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తారు. ఇందులో చికిత్సతో సంబంధం లేని మరో ఇద్దరు అనుభవజ్ఞులైన వైద్యులు ఉంటారు. ఈ బోర్డు కూడా స్వతంత్రంగా రోగి పరిస్థితిని పరిశీలించి తుది అభిప్రాయం వెల్లడిస్తుంది.

**మేజిస్ట్రేట్‌కు సమాచారం తప్పనిసరి :** ప్రైమరీ, సెకండరీ మెడికల్ బోర్డుల అభిప్రాయాలు ఒకే విధంగా ఉంటే, గార్డియన్ సమ్మతితో పాటు సంబంధిత వివరాలను ఆసుపత్రి ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు తప్పనిసరిగా తెలియజేయాలి. అనంతరం మాత్రమే లైఫ్ సపోర్ట్ వ్యవస్థలను నిలిపివేయవచ్చు. దీనివల్ల మొత్తం ప్రక్రియకు చట్టబద్ధతతో పాటు పారదర్శకత కూడా నిర్ధారితమవుతుంది.

**అడ్వాన్స్ డైరెక్టివ్ లేకపోయినా అవకాశం :** రోగి ముందుగా అడ్వాన్స్ డైరెక్టివ్ ఇవ్వని పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. అలాంటి సందర్భాల్లో చికిత్స అందిస్తున్న వైద్యుడు ఆసుపత్రి యాజమాన్యానికి సమాచారం ఇస్తాడు. ప్రైమరీ మెడికల్ బోర్డు రోగి పరిస్థితిని పరిశీలించి కుటుంబ సభ్యులకు చికిత్స కొనసాగించడం లేదా నిలిపివేయడం వల్ల కలిగే పరిణామాలను పూర్తిగా వివరించి రాతపూర్వకంగా నమోదు చేస్తుంది. అనంతరం సెకండరీ మెడికల్ బోర్డు కూడా పరిశీలన జరిపి నిర్ణయం తీసుకుంటుంది.

**భిన్నాభిప్రాయాలు వస్తే హైకోర్టు ఆశ్రయం :** సెకండరీ మెడికల్ బోర్డు చికిత్స నిలిపివేయడానికి అంగీకరించని పరిస్థితుల్లో లేదా వైద్య బోర్డుల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తినప్పుడు రోగి గార్డియన్ లేదా కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుంది. అవసరమైతే హైకోర్టు 20 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న వైద్యులతో స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటుంది.

**రికార్డుల భద్రతకు ప్రత్యేక నిబంధనలు :** రోగికి లైఫ్ సపోర్ట్ నిలిపివేసిన తర్వాత ఆ విషయాన్ని సంబంధిత మేజిస్ట్రేట్ హైకోర్టుకు తెలియజేయాల్సి ఉంటుంది. మొత్తం ప్రక్రియకు సంబంధించిన అన్ని రికార్డులను రోగి మరణించిన తేదీ నుంచి కనీసం మూడు సంవత్సరాల పాటు భద్రపరచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తినా వాటి పరిశీలనకు ఇవి ఉపయోగపడతాయి.

**పటిష్ట పర్యవేక్షణకు అధికారులకు బాధ్యతలు :** ఈ మార్గదర్శకాల అమలును కట్టుదిట్టంగా పర్యవేక్షించే బాధ్యతను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. ఈ ప్రక్రియను అత్యంత పటిష్టంగా పర్యవేక్షించాలని, ఏ దశలోనూ పొరపాట్లు, అవకతవకలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

**మానవీయ దృక్పథంతో కీలక నిర్ణయం :** అంతిమదశలో కోలుకునే ఆశలు పూర్తిగా ముగిసిన రోగులకు అవసరం లేని వైద్య చికిత్సలతో బాధను పొడిగించడం కంటే, వారి స్వేచ్ఛా నిర్ణయాన్ని గౌరవిస్తూ చట్టబద్ధమైన, పారదర్శకమైన విధానంలో గౌరవప్రదమైన మరణానికి అవకాశం కల్పించడం ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. రోగి హక్కులను, కుటుంబ సభ్యుల నిర్ణయాలను, వైద్యుల బాధ్యతలను సమతుల్యం చేస్తూ రూపొందించిన ఈ విధానం రాష్ట్ర వైద్యరంగంలో ఒక మానవీయ సంస్కరణగా వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అన్నవరం రత్నగిరిపై చిల్డ్రన్స్ పార్క్ ప్రతిపాదన



- సానుకూలంగా స్పందించిన మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్)** :అన్నవరం దేవస్థానం రత్నగిరి కొండపై పిల్లల కోసం ప్రత్యేక చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతూ అన్నవరం దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, జనసేన నాయకులు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను బుధవారం రాజమహేంద్రవరంలోని హుకుంపేట క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా స్వామివారి శేషవస్త్రంతో మంత్రిని సత్కరించి, ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం గతంలో తొలగించిన పార్కును ప్రస్తుతం శివసదన్, ప్రకాశ్‌సదన్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అనంతరం హుకుంపేట క్యాంపు కార్యాలయంలో మంత్రి దుర్గేష్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. అత్యవసర అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.
ఇదే సందర్భంగా ఏపీఎన్జీవోల ప్రతినిధులు కూడా మంత్రిని కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రజలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందిన ప్రతి వినతిపై త్వరితగతిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు.

## ఖేలో ఇండియా కింద రూ.1000 కోట్ల ప్రతిపాదన



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి వినీల్ కృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా పథకం కింద రాష్ట్రానికి సంబంధించిన సుమారు రూ.1000 కోట్ల విలువైన క్రీడా మౌలిక వసతుల ప్రతిపాదనలను ఆమోదించి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.
రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, మల్టీపర్పస్ హాళ్లు, అథ్లెటిక్స్ ట్రాక్‌లు, ఫుట్‌బాల్ మైదానాలు, స్విమ్మింగ్ పూల్స్‌తో పాటు ఇతర ఆధునిక క్రీడా సదుపాయాల ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని మంత్రి కోరారు. ఈ ప్రాజెక్టులు అమలైతే రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడటంతో పాటు గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ లభించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగుతాయని వివరించారు.
అదేవిధంగా అన్నమయ్య జిల్లాలో స్పోర్ట్స్ హబ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, రాయచోటిలో ఆధునిక ఫుట్‌బాల్ టర్ఫ్ నిర్మాణానికి రూ. 42.62 కోట్ల కేంద్ర నిధులు మంజూరు చేయాలని వినీల్ కృష్ణకు లేఖ ద్వారా మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి అవసరమైన నిధులను త్వరితగతిన విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## టెట్ అంశంలో చట్ట సవరణకు ప్రభుత్వం చొరవ చూపాలి

- ప్రత్యేక టెట్‌తో సమస్య పరిష్కారం కాదన్న వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : టెట్ అంశంలో రాష్ట్రంలోని వేలాది మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను అన్యాయంగా బలిపశువులను చేయొద్దని, వారి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్ట సవరణ సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం వారిని అనిశ్చితిలోకి నెట్టడం బాధాకరమని సంఘం అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.
ఇతర రాష్ట్రాలు ఉపాధ్యాయుల ప్రయోజనాల పరిరక్షణకు న్యాయపరంగా, పరిపాలనాపరంగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదే స్థాయిలో ముందుకు రావడం లేదని వారు విమర్శించారు. ప్రత్యేక టెట్ నిర్వహించడం మాత్రమే పరిష్కారం కాదని, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అవసరమైన చట్ట సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.
అర్హత మార్కుల విషయంలో ఇతర రాష్ట్రాలు సడలింపులు, ఉపశమన చర్యలను పరిశీలిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధ్యాయుల ప్రయోజనాలను పరిరక్షించేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సంఘం విజ్ఞప్తి చేసింది. పార్లమెంట్‌లో చట్ట సవరణ ద్వారానే ఉపాధ్యాయులకు శాశ్వత రక్షణ లభిస్తుందని పేర్కొంటూ, ప్రభుత్వం ఇకపై నిర్లక్ష్యం వీడి బాధ్యతాయుతంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది.

## దేవుడిపై భక్తిని రాజకీయాలకు బలిచేయొద్దు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : దేవుడిపై భక్తిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం, ఆలయాలపై అసత్య ప్రచారాలు చేయడం ద్వారా కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీయడం అత్యంత బాధ్యతారాహిత్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ హిందూ ధార్మిక సంస్థలపై నిరాధార ఆరోపణలు చేసి భక్తుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వాస్తవాలు, పూర్తి గణాంకాలు, పారదర్శక సమాచారంతో చర్చించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.
దేవాలయాలు రాజకీయ ప్రయోగశాలలు కావని, అవి కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకలని మంత్రి అన్నారు.

# పొగాకు కొనాలి... రైతు నిలవాలి!

- కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు తప్పనిసరి
- రైతులను ఇబ్బంది పెట్టే కంపెనీలపై కఠిన చర్యలు
- టొబాకో బోర్డు పనితీరుపైనా సీఎం అసంతృప్తి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రైతుల్లో నమ్మకం, ధైర్యం కల్పించేలా వెంటనే పొగాకు కొనుగోళ్లు పెద్దఎత్తున జరపాలని, ఇందుకోసం వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పొగాకు కంపెనీలకు స్పష్టం చేశారు. ట్రేడర్లు కొనుగోళ్లు తగ్గించడం సరికాదని, కర్నాటకలో తలెత్తని సమస్య ఏపీలో ఎందుకు ఉత్పన్నం అవుతోందని సీఎం ప్రశ్నించారు. టొబాకో బోర్డు పనితీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందిపెట్టేలా నడుచుకుని కంపెనీలు గుడ్ విల్ పోగొట్టుకోవద్దని, కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలకు మళ్లితే... తలెత్తే పరిస్థితి గురించి పొగాకు కంపెనీలు ఆలోచన చేయాలన్నారు. సచివాలయంలో బుధవారం పొగాకు కొనుగోళ్ల ప్రస్తుత స్థితిపై అధికారులు, ట్రేడర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మొత్తం 28 కంపెనీలు సమర్పించిన ఇండెంట్ వివరాలు, ప్రస్తుతం జరిపిన కొనుగోళ్ల శాతాన్ని సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోలు చేయకుండా ప్రభుత్వానికి సహకరించకపోతే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కిలోకు రూ. 200 తగ్గకుండా, మొత్తం కొనుగోళ్లు జరిపితీరాలన్నారు. ముఖ్యంగా అతి పెద్ద మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు అయిన ఐటీసీ లిమిటెడ్, గాడ్ ఫ్రే ఫిలిప్స్ (ఐ) లిమిటెడ్, వీఎస్టీ ఇండస్ట్రీస్ 95.50 మిలియన్ కేజీల పంట కొనుగోళ్లకు ఇండెంట్ ఇవ్వగా... ఇప్పటివరకు కేవలం 17.6 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే కొనుగోలు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ సీజన్లో ఐదవ సారి ఇదే అంశంపై సమీక్ష నిర్వహించాల్సి వచ్చిందంటే కంపెనీల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రైతులు డిమాండ్‌కు మించి పొగాకు సాగు చేయడం ప్రస్తుత సమస్యకు కారణమని ట్రేడర్లు సీఎంకు వివరించారు. ఇప్పటికే అవసరానికి మించి కొనుగోళ్లు చేశామని... దానికి తోడు ఎగుమతులు కూడా తగ్గాయని తెలిపారు. అయినప్పటికీ కొనుగోళ్లు కొనసాగిస్తామని కంపెనీల ప్రతినిధులు వెల్లడించారు. పొగాకు బహిరంగ మార్కెట్ లేకపోవడం సమస్యను తీవ్రం చేశాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే కంపెనీలు 142 మిలియన్ కేజీలకు ఇండెంట్ ఇవ్వగా, రైతులు 232 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి చేశారన్నారు. దీంతో ధర పతనం కావడం, కొనుగోళ్లు లేకపోవడం జరిగిందని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హ్వాసంగ్‌తో లోకేష్ భేటీ...

- ఏపీకి మరో భారీ పెట్టుబడి సంకేతం
- 900 కోట్ల గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌కు వేగం
- సంవత్సరానికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూల తయారీ లక్ష్యం



**బుసాన్ (సౌత్ కొరియా)**: ఫుట్ వేర్, మెటీరియల్స్, ఆటోమోటివ్ కాంపొనెంట్స్, ఓడిఎం స్పోర్ట్ ఫ్యాషన్ పరికరాల తయారీలో పేరెన్నికగన్న హ్వాసంగ్ గ్రూప్ ఉన్నతస్థాయి బృందంతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బుసాన్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... కుప్పంలో హ్వాసంగ్ పాదరక్షల తయారీ యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గించి, ఖర్చులను తగ్గించుకోవడానికి, సరఫరాదారులతో అనుసంధానానికి ఇంటిగ్రేటెడ్ ఫుట్ వేర్ కాంపొనెంట్ డ మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా కుప్పంలోనే ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాలజీ, ఏఐ ఫిట్టెడ్ కస్టమైజేషన్, సస్టయినబుల్ మెటీరియల్స్ ను కవర్ చేస్తూ నెక్స్ట్ జెన్ అథ్లెటిక్స్ ఫుట్ వేర్ ఆర్ డ డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్ ను ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సేవలందించేలా, ఒక సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను (కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ, విశాఖపట్నంలో డిజైన్ మరియు కార్పోరేట్/లాజిస్టిక్స్ విభాగాలు) అభివృద్ధి చేయండి. Hwaseung Footwear టైర్-1, టైర్-2 స్థాయి విక్రేతలతో ఒక సప్లయర్ సమావేశాన్ని ఏపీలో నిర్వహించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.
హ్వాసంగ్ కార్పోరేషన్ అఫ్లియేటెడ్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్-రియోంగ్ మాట్లాడుతూ... హ్వాసంగ్ ఫుట్‌వేర్, కుప్పంలో 900 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్పటికే ప్రకటించిందని తెలిపారు. అడిడాస్‌తో సహా గ్లోబల్ బ్రాండ్‌లకు ప్రముఖ రాజువీ సరఫరాదారు అయిన ఈ ప్లాంట్, సంవత్సరానికి 20 మిలియన్ల జతల స్పోర్ట్స్ షూలను తయారుచేస్తుందని అన్నారు. ప్రారంభంలో ప్రధానంగా ఎగుమతి కోసం, ఆ తర్వాత దేశీయ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. హ్వాసంగ్ కార్పోరేషన్ ఆటో విడిభాగాల విభాగం పూణే, చెన్నై, అనంతపురం జిల్లా గూడపల్లిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు. ఈ సమావేశంలో హ్వాసంగ్ ఆటో బిజినెస్ డివిజన్ హెడ్ జియోన్ హ్యాన్ హో, మెటీరియల్ బిజినెస్ డివిజన్ హెడ్ లీ మూ జంగ్, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ బిజినెస్ హెడ్ యూన్ జిన్ మిన్, మేనేజ్‌మెంట్ డివిజన్ హెడ్ క్వాక్ మ్యుంగ్ చుల్, స్ట్రాటజీ డ ప్లానింగ్ డైరెక్టర్ లీ జిన్ సియోక్ (మార్క్ లీ), కాన్స్టాంటిన్ వాసిలీవ్ పాల్గొన్నారు.

# కృష్ణా డెల్టాకు పట్టిసీమతో ఉపిరి.

- పట్టిసీమ ఒట్టిసీమ అన్న జగన్ ఏం సమాధానం చెబుతారు?
- చంద్రబాబు ముందుచూపుకి నిదర్శనం పట్టిసీమ.
- సూపర్ ఎల్ నినో ను సమర్ధంగా ఎదుర్కొంటాం.
- పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా నీటి విడుదల.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే లోపు గోదావరి వృధా జలాలను, కృష్ణ డెల్టాకు తరలించాలన్న ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన పట్టిసీమ ఎత్తిపోతల సత్ఫలితాలు ఇచ్చిందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కేవలం 1300 కోట్ల రూపాయలు వ్యయంతో ఏర్పాటుచేసిన పట్టిసీమ వల్ల వేల కోట్ల రూపాయల పంట పండిందన్నారు. బుధవారం ఉదయం ఏలూరు జిల్లా లో పట్టిసీమ, తూర్పు గోదావరి జిల్లాలో తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేశారు.
పట్టిసీమ డెలివరీ పాయింట్, తాడిపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు దగ్గర గోదావరికి జలహారతి ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను, కృష్ణాజలాలతో అనుసంధానం చేసి, నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నాడు పట్టిసీమ ఒట్టిసీమ అన్న జగన్, ఇప్పుడు ఏముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇప్పటివరకు పట్టిసీమ ద్వారా 442 కు పైగా టీఎంసీ లను కృష్ణా డెల్టాకు తరలించాం. 50వేల కోట్ల ఆదాయాన్ని సృష్టించామని ఆయన అన్నారు. దూరదృష్టి, ముందుచూపు, నిర్మాణాత్మక ఆలోచన కలిగిన నాయకుడు ఉంటే ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో పట్టిసీమే ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు. పాలన అనుభవం లేకపోవడం, విధ్వంసపు ఆలోచనలు వల్లే జగన్ తన పాలనా కాలంలో పట్టిసీమ వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. గోదావరి కి ఎగువ నుండి వస్తున్న నీటిని, సముద్రంలోకి పోకుండా, ఒడిసిపట్టుకుని కృష్ణా డెల్టాకు తరలించటం గొప్ప విషయం అన్నారు. ఆల్మట్టి నుండి జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్ వరకు ఖాళీ జలాశయాలతో ఉన్న కృష్ణా కు ఈ పట్టిసీమ నేడు ఉపిరి పోస్తుందన్నారు.
**ఎల్ నినోను సమర్ధంగా ఎదుర్కొందాం** : చంద్రబాబు సూచనలతో సూపర్ ఎల్ నినోను సమర్ధంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి రామానాయుడు చెప్పారు. ముందస్తు ప్రణాళికలతో ప్రతి నీటి బొట్టునూ సమర్ధంగా వినియోగించుకుంటున్నామన్నారు. ఎల్ ని నో, సూపర్ ఎల్ నినో ల గురించి ప్రపంచవ్యాప్తంగా ఆందోళన చెందుతున్న ప్రస్తుత తరుణంలో మన రాష్ట్రంలో ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోవడానికి కూటమి ప్రభుత్వం అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటుందన్నారు.
ఎల్ ని నో లేని రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు జలధార జల హారతి 100 రోజుల కార్యక్రమం చేపట్టారన్నారు. అతివృష్టి, అనావృష్టి ప్రాంతాలలో డ్రైన్లు, కాలువలు ఏర్పాటు చేసి వీటిని సమీప చెరువులకు అనుసంధానించడం ద్వారా ప్రతి నీటి బొట్టు ఒడిచి పట్టవచ్చు అన్నారు. జల ధార-జల హారతి కార్యక్రమంలో ఇప్పటికి 98 రోజులు పూర్తయ్యాయి అన్నారు.. ఈ పనులన్నీ సత్ఫలితాలు ఇవ్వబోతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఏంటంటే భూమినే జలాశయంగా మార్చుకుని భూగర్భ జల సంపదను వృద్ధి చేయడమే అని ఆయన వివరించారు. భూగర్భ జల సంపద మట్టం ఒక మీటరు పెరిగితే 99 టీఎంసీల నీరు లభ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. అలాగే సమర్థ నీటి యాజమాన్యం వల్ల నీటి పొదుపును పాటించవచ్చు అన్నారు. ఉదాహరణకు మన కృష్ణానదిని తీసుకుంటే జూరాల, ఆల్మట్టి, శ్రీశైలం నాగార్జునసాగర్ రిజర్వాయర్లో నీళ్లు లేవు. మన పులిచింతలలో మాత్రం ఈరోజు కూడా 28 టీఎంసీలు నీరు ఉంచుకోగలిగాం అని మంత్రి వివరించారు.
70 సంవత్సరాల చరిత్ర తీసుకుంటే జూలై 5వ తేదీ కూడా గోదావరికి ఇన్ఫ్లోలు లేకపోవడం ఇది మొదటిసారి అని మన ఇరిగేషన్ నిపుణులు చెబుతున్నారు. నిన్న 56,000 క్యూసెక్కులు నీరు వచ్చిందని ఈ నీటిలో 8,000 క్యూసెక్కులను ప్రతిరోజు పట్టిసీమ ద్వారా కృష్ణ డెల్టాకు పంపుతామన్నారు.
ఇలా ప్రాధాన్య క్రమంలో అత్యవసరాల ప్రాతిపదికన నీటిని పొదుపుగా వాడుకుందామన్నారు. ఎల్ నినోని సమర్థంగా ఎదుర్కొందామన్నారు. ప్రతినిత్యం, ప్రతి ఎకరాకు, ప్రతి రైతుకి నీ అందించాలని ఆలోచించే చంద్రబాబు ఉండటం మన దృష్టంగా రామానాయుడు అభివర్ణించారు. అలాగే ప్రభుత్వంతో పాటు ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు ముఖ్యంగా రైతు సోదరులు కూడా పూర్తిగా సహకరించాలని రామానాయుడు విజ్ఞప్తి చేశారు. ఆరుతడి పంటలకు అవకాశం ఉన్నచోటల్లా, ఆ పంటలు వేసి నీటి పొదుపును పాటించాలన్నారు. అలాగే ముందు తాగునీటికి, ఆ తరువాతనే సాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

# పథకాల ప్రచారానికి డిజిటల్ బలం!



- సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి
- 175 నియోజకవర్గాల్లో సోషల్ మీడియా యూనిట్ల క్రియాశీలతకు ఆదేశాలు
- డిజిటల్ కమ్యూనికేషన్ బలోపేతంపై మంత్రి కొలుసు పార్థసారథి దిశానిర్దేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా, సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ (ఏపీడీసీ) అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లిలోని ఏపీ డిజిటల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి సంస్థ కార్యకలాపాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. గత రెండేళ్లలో ప్రభుత్వ సోషల్ మీడియా వేదికల ద్వారా మిలియన్ల సంఖ్యలో వ్యూయర్ టచ్‌పాయింట్లు నమోదైనట్లు అధికారులు వివరించగా, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై మరింత సమగ్ర సమాచారం చేరేలా డిజిటల్ ప్రచారాన్ని విస్తరించాలని మంత్రి సూచించారు. సమావేశంలో ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ కార్యక్రమాలకు సంబంధించిన ధృవీకరించిన సమాచారాన్ని సకాలంలో ఏపీడీసీతో పంచుకోవాలని మంత్రి ఆదేశించారు. దీనివల్ల ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా, కచ్చితంగా ప్రజలకు చేరవేయడం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రభుత్వ సందేశాల విస్తరణ కోసం డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లను ప్రభుత్వ కమ్యూనికేషన్ వ్యవస్థలో భాగస్వాములను చేసే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజలకు విశ్వసనీయ సమాచారం అందించేందుకు పోలీసు శాఖ ధృవీకరించిన సమాచారాన్ని ఏపీడీసీతో సమన్వయం చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ చేరువను పెంచేందుకు వ్యూహాత్మక సోషల్ మీడియా ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సోషల్ మీడియా వేదికల కోసం నాణ్యమైన డిజిటల్ కంటెంట్ రూపొందించేందుకు ప్రత్యేక కంటెంట్ క్రియేటర్లను నియమించాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రస్తుతం ప్రజల్లో విస్తృత ఆదరణ పొందుతున్న రీల్స్, షార్ట్-ఫామ్ వీడియోలను ప్రభుత్వ డిజిటల్ కమ్యూనికేషన్‌లో కీలక భాగంగా మార్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాహిత నిర్ణయాలను ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర డిజిటల్ వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోషల్ మీడియా యూనిట్లను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేసి, ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేశారు.
సమీక్ష అనంతరం ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులతో మంత్రి కొలుసు పార్థసారథి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ కార్యకలాపాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి సుష్మిత, ఐఅండ్‌పీఆర్ ప్రత్యేక అధికారి గల్లా శేషుకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గూటుపల్లి రైతులకు ఊరట



- నిషేధిత జాబితా నుండి 2074 ఎకరాలు తొలగింపు
- రైతుల సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్
- గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామని వెల్లడించిన మైనారిటీ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గం బేతంచర్ల మండలంలోని గూటుపల్లి గ్రామ భూములకు నిషేధిత భూముల జాబితా నుండి విముక్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గూటుపల్లి పరిధిలో నిషేధిత జాబితాలో కొనసాగుతూ వస్తున్న 2074.59 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ జీవో నెంబర్ - 77ను బుధవారం ప్రభుత్వం జారీ చేసింది. రైతుల వినతి మేరకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని గూటుపల్లి గ్రామ పరిధి లోని 142 సర్వే నెంబర్లలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేసినట్లు మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. లి
**వక్ఫ్ ఆస్తుల జాబితాలోకి చేర్చడంతో ఇబ్బందులు** : రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రెవిన్యూ శాఖలో తీసుకున్న అసంబద్ధమైన నిర్ణయాలతో రైతులకు సంబంధించిన, సాగు చేసుకుంటున్న భూములను నిషేధిత 22ఏ జాబితాలోకి చేర్చడం తో పట్టాదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామ పరిధిలోని భూములు కూడా ఆనాడు 22ఏ జాబితా లోకి చేరాయి. గ్రామంలో ఉన్న 215 సర్వే నంబర్లను (195 పట్టా భూములు, 18 సర్వీస్ ఇనామ్ భూములు మరియు 2 ఎండోమెంట్ భూములు) రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ(1)(సి )కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితాలో వక్ఫ్ ఆస్తులుగా చేర్చారు. దీని ఫలితంగా దాదాపు 1,000 మంది ఖాతాదార్లు రిజిస్ట్రేషన్లు, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు పడుతూ వచ్చారు. గూటుపల్లి సమస్య మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వద్దకు వచ్చింది. వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్ విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, వక్ఫ్ బోర్డు సీఈఓ యాకుబ్ భాషా లను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు విచారణ చేసిన అధికారులు గూటుపల్లి గ్రామంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చబడి, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని నివేదించారు. ఫలితంగా 142 సర్వే నంబర్లలోని 2074.59 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22-ఎ(1)(సి) కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితా నుండి తొలగించాలని ఆదేశిస్తూ జీవో నెంబర్ -77 ను ప్రభుత్వం జారీ చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న మరో 613.84 ఎకరాల విస్తీర్ణం గల మిగిలిన 74 సర్వే నంబర్ల విషయంలో తదుపరి సవివరమైన పరిశీలన మరియు ధృవీకరణ అవసరముందని, త్వరలో దీనిని కూడా పరిష్కరిస్తామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టి ఉత్తర్వులు జారీ చేసిందని మైనారిటీ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా తమ గ్రామ సమస్యను, రైతుల ఇబ్బందులను ప్రత్యేకంగా గుర్తించి నిషేధిత జాబితా నుండి తమ భూములను తొలగించడం పట్ల గూటుపల్లి రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణను వేగవంతం చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల.



**మహబూబ్‌నగర్, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆయిల్ పామ్ సాగు విస్తర్ణము పెంపుపై జిల్లా రెవెన్యూ అధికారి ఎ.నిర్మలా మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉద్యానవన, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మైక్రో ఇరిగేషన్, ప్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జాతీయ వంటనూనెల మిషన్ - ఆయిల్ పామ్ (NMEO-OP) పథకం కింద ఆయిల్ పామ్ సాగు విస్తరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గతములో, సాంకేతిక బృందం, భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ వారు మన జిల్లాలో 5,000 ఎకరాల ఆయిల్ పామ్ పంట వేయడానికి అవకాశం ఉన్నదని గుర్తించారు. అందులో ఇప్పటివరకు 4,782 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చింది ( 96 %). ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) గాను, 1,500 ఎకరాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 792 ఎకరాలకు (260 మంది రైతులకు) పరిపాలనా అనుమతులు లభించాయి. అయితే, అందులో 130 ఎకరాలలో (31 మంది రైతులు) ఇప్పటివరకు తోటలు నాటడము జరిగిందని, మిగిలిన లక్ష్యం సాధనకైక్షేత్రస్థాయిలో చర్యలు వేగవంతం చేయాలనీ అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న భారీ సబ్సిడీలు, వివిధ రకాల రాయితీల పథకాలను సుదీర్ఘంగా వివరించారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ రైతులకు స్థిరమైన, ప్రతి నెలా గ్యారెంటీ ఆదాయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సూక్ష్మ నీటి పారుదల (డ్రిప్) సదుపాయం, ప్రభుత్వ కొనుగోలు గ్యారెంటీ మరియు మొక్కల పెంపకానికి ఇచ్చే తోడ్పాటుతో ఆయిల్ పామ్ జిల్లా వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చబోతోందని అన్నారు. సాగు విస్తరణను మరింత వేగవంతం చేసేందుకు ఉద్యానవన అధికారులు మరియు ఉద్యాన విస్తరణ అధికారులకు నియోజకవర్గాల వారీగా స్పష్టమైన డిపార్ట్‌మెంట్ లక్ష్యాలను ఆయన నిర్దేశించారు.

అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యపరచడంలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలన్నారు. అందుబాటులో నీటి వనరులు కలిగి ఉన్న రైతులను గుర్తించి, వారిని ఆయిల్ పామ్ వైపు మళ్లించే బాధ్యతను అసిస్టెంట్ అగ్రికల్చర్ డైరెక్టర్లు, మండల వ్యవసాయ అధికారులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు తీసుకోవాలని ఆదేశిస్తూ వారికి ప్రత్యేక గ్రామాల వారీగా లక్ష్యాలను ఖరారు చేశారు.

సహకార సంఘాల అనుసంధానంపై జిల్లా సహకార అధికారి కృష్ణ మాట్లాడుతూ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన ఆర్థిక సాయం, ఎరువులు మరియు పెట్టుబడి మద్దతును అందించేందుకు గల మార్గాలను వివరించారు. ఆయిల్ పామ్ రైతులకు ప్యాక్స్ నెట్‌వర్క్ ఎంతగానో తోడ్పడుతుందని చెబుతూ, ప్యాక్స్ సీఈఓ లకు సాగు నమోదుకు సంబంధించిన నిర్దేశిత బాధ్యతలను అప్పగించారు.

సమావేశ ముగింపు సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల మాట్లాడుతూ, అధికారులు ఎవరూ వ్యక్తిగతంగా కాకుండా ఉద్యానవన, వ్యవసాయ, సహకార శాఖలు ఒకే తాటిపైకి వచ్చి సమన్వయంతో పని చేయాలని సూచించారు . ప్రతి వారం శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాల ప్రగతిని జిల్లా కలెక్టర్ గారు సమీక్షిస్తారని, రైతుల దరఖాస్తుల నమోదు నుండి డ్రిప్ పరికరాల అమరిక వరకు ప్రతీ దశలోనూ అధికారులు రైతులకు అండగా నిలవాలని స్పష్టం చేశారు. లాభదాయకమైన ఈ ఆయిల్ పామ్ సాగును జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమన్వయ సమావేశంలో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు , వ్యవసాయ అధికారులు , ఉద్యాన అధికారులు , వ్యవసాయ విస్తరణ అధికారులు , ఉద్యాన విస్తరణ అధికారులు మరియు వివిధ ప్యాక్స్ సొసైటీల సీఈఓ లు , డ్రిప్, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- రక్షణను విస్మరించి సాధించే ఉత్పత్తి వ్యర్థం.
- రక్షణ సూత్రాలు ఆచరిస్తూ పని చేయాలనీ అధికారులకు సూచన.
- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్.



**మంచిర్యాల, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** రక్షణను విస్మరించి సాధించే ఉత్పత్తి వ్యర్థం అని రక్షణ సూత్రాలు గోడల మీదకే పరిమితం కాకుండా ఆచరణలో పాటించాలని అని పిలుపునిచ్చారు శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీ మునిగంటి శ్రీనివాస్. మంగళవారం ఉదయం రక్షణపై ఎస్ఆర్పీ 3 గని అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో మంగళవారం ఉదయం శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని రాశా 3 గనిలో సేఫ్టీ అవేర్నెస్ మీటింగ్ నిర్వహించారు. గని అధికారుల నుంచి గత నాలుగు ఏళ్లుగా చోటుచేసుకున్న ప్రమాదాల వివరాలు పరిశీలించారు. దాంతో పాటు ఇటీవల జరిగిన ప్రమాదాలపై విశ్లేషించారు. చాలా రోజులుగా ఉత్పత్తి, ఉత్పాదకత లో వెనుకబడిన గని గత నెల 100 శాతం ఉత్పత్తి సాధించటంతో పాటు మంచి ఓమ్మెస్ సాధించటం గర్వకారణం అన్నారు. కానీ గత నెలరోజులుగా గనిలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు విచారకరం అన్నారు. చిన్న ప్రమాదం సైతం మొదట ఉద్యోగికి తరువాత ఆ కుటుంబానికి తద్వారా యాజమాన్యానికి తీరని లోటు అన్నారు. పని వేళల్లో కార్మికుడి తొందరపెట్టడం ద్వారా ప్రమాద అవకాశాలు ఎక్కువుంటాయన్నారు. ముందుగా సర్దార్ కోల్కట్టర్తో ఫేస్లోకి వెళ్లి రూఫ్ టెస్ట్ చేసి , బొల్టింగ్ , సపోర్టింగ్ ఏర్పాట్లు జరిగాకనే పనికి అనుమతించాలన్నారు. ఎస్ఓపీలు, సీఓపీలు పాటిస్తూ సేఫ్గా పని చేస్తేనే రక్షణ సాధ్యం అన్నారు. రక్షణను విస్మరించి సాధించే ఉత్పత్తి వ్యర్థం అని స్పష్టంచేశారు. నిరంతరం రక్షణ తనిఖీలు జరగాలి మెటీరియల్స్ సక్రమంగా అందుబాటులో ఉండాలనీ వాటిని ఆచరణలో పెట్టాలి అప్పుడే రక్షణ సాధ్యం అన్నారు. ప్రమాదం జరిగినపుడు ఒకరి తప్పులు ఒకరు ఎంచుకోవటం , పరస్పర ఆరోపణలకు పరిమితం కాకుండా అందరూ కలిసికట్టుగా రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ రవికుమార్, గని మేనేజర్ వెంకట్ రావు, రక్షణ అధికారి మహేందర్, సంక్షేమ అధికారి వెంకన్న, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ అంబాల రవి , అధికారులు, సూపర్వైజర్లు, మైనింగ్ స్టాఫ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా..



**మహబూబ్‌నగర్ జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** శిక్షణ ఫౌండేషన్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమం పరిశీలన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం మహబూబ్‌నగర్‌లోని బోయపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి, శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలు చేయ బోతున్న ప్రీ-లిటరసీ, ప్రీ-న్యూమరసీ ఆధారిత బేసిక్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు కార్యక్రమం వివరాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 50 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి, చిన్నారుల్లో ప్రీ-లిటరసీ, ప్రీ-న్యూమరసీ, మోటార్ స్కిల్స్ అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీలకు ట్యాబ్‌లు, బ్లూటూత్ స్పీకర్లు, టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్ (TLM), స్టేషనరీతో పాటు సిబ్బందికి శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రియదర్శిని' పాఠ్యాంశాలకు అనుగుణంగా 'శిశు వికాసన' పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించి, అందులో అవసరమైన ఆడియో కంటెంట్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ నిర్వహించాల్సిన బోధనా కార్యక్రమాలు యాప్‌లో ఉండటంతో, వాటి ద్వారా చిన్నారులకు సులభంగా బోధన అందించవచ్చని వివరించారు. పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) మెరుగుదలకు 'ప్రేరణ FLN' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు, తరగతి కార్యకలాపాల్లో చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు స్టార్ అవార్డులు, బ్యాడ్జ్‌లు, గ్రూప్ యాక్టివిటీలు, బాధ్యతల కేటాయింపు వంటి విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల అభ్యాస పురోగతిని అంచనా వేసేందుకు పిక్టోరియల్ ప్రోగ్రెస్ కార్డులు, తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించిన ఫౌండేషనల్ లెర్నింగ్ పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆత్రేయ హస్త ట్రస్టు దాతల మద్దతు తో శిక్షణ ఫౌండేషన్ అమలు చేయబోతున్న ఈ కార్యక్రమం 2026 నుండి 2029 వరకు 3 సంవత్సరాల పాటు పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, కార్యక్రమం వల్ల పిల్లల అభ్యాసంలో మెరుగైన ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని, ఒకటి లేదా రెండు నెలల తర్వాత కార్యక్రమం పురోగతిని ప్రజలకు తెలియజేసే విధంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. శిక్షణ ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, ఎం.ఈ.ఓ లక్ష్మణ్ సింగ్, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు, కాశీనాథ్ సీనియర్ ఆపరేషన్ మేనేజర్, యాదప్ప జిల్లా మేనేజర్, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజాస్వామ్య పరిరక్షణ"కై "సర్"లో మీ ఓటును కాపాడుకోవాలి

- "తెలంగాణ ఉద్యమకారుల వేదిక" రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ సూచన



**ములుగు, జిల్లాప్రతినిధి జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్రంలో గత మూడు నెలల నుండి ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ జరుగుతున్న సందర్భంలో రాజకీయ పార్టీల కార్యకర్తలు, పౌర సమాజం, యువజన సంఘాలు, విశ్రాంత ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, సామాజిక చైతన్య సంస్థలు, వేదికలు, వాకర్ సంఘాలు, అత్యంత జాగ్రత్తతో 18 సంవత్సరాల పైబడిన యువతీ యువకుల నుండి అత్యంత వృద్ధులైన వారి ఓట్లను కాపాడవలసిన బాధ్యతను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని' ప్రెస్ క్లబ్బు"లో ఎస్ ఐ ఆర్ (సర్) సమస్యలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని సుదీర్ఘంగా మాట్లాడారు. ఎన్నికల్లో ధనవంతులు ఓటు హక్కును ఉపయోగిస్తారని కేవలం పేద వర్గాలు మాత్రమే ప్రభుత్వాల తలరాతలు నిర్ణయిస్తారని అలాంటి ఓట్లు జాబితా నుండి గల్లంతు కాకూడదని అన్నారు. సంక్లిష్టమైన ఓటర్ నమోదు ఫారం నింపే అవగాహన లేని ఓటర్లు అత్యధికంగా ఉన్న విషయాన్ని ఎలక్షన్ కమిషన్ అధికారులు, నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారులు గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న "ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్' సాయిని నరేందర్ మాట్లాడుతూ జనాభాలో 15 శాతం ఉన్న వృద్ధుల ఓట్లు, ఆర్థికంగా సామాజికంగా పేద వర్గాల ఓట్లు ప్రజాస్వామ్యం మనగడకు కీలక పాత్ర పోషిస్తాయని విషయాన్ని ఎలక్షన్ అధికారులు, సిబ్బంది పౌర సమాజం నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. పేద వర్గాల అభివృద్ధి సంక్షేమం కొరకే రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం వ్యవస్థల నిర్మాణం జరిగిందని అందులో ఓటర్ల జాబితా సవరణ అత్యంత ప్రాధాన్యత కలిగిందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేర్కొన్నారని, అందుకే పేదలు, దనికులు అక్షరాస్యులు నిరక్షరాస్యులు అనే విచక్షణ లేకుండా 18 సంవత్సరాలు పైబడిన ప్రతి పౌరునికి అంబేద్కర్ ఓటు హక్కు కల్పించారని అన్నారు. దేశంలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నడుస్తున్న క్రమంలో అనేక అవకతవకలు వాస్తవ ఓటర్లను ఓటర్ల జాబితాలో కనిపించకుండా పోయిన కథనాలు ఎన్నో బీహార్ పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో చోటు చేసుకున్నాయని కథనాలు అనేకం వెలువడ్డాయని అన్నారు. ఓటర్ నమోదు కార్యక్రమాలలో జరిగిన అక్రమాలతో కొన్ని రాష్ట్రాలలో పార్టీల తలరాతలు కూడా మారాయని పత్రికలు, ఇతర మీడియా సంస్థలు ప్రజాస్వామ్య వాదులు గగ్గోలు పెడుతున్న విషయాలను విస్మరించరానివని అన్నారు. గ్రామాల నుండి పట్టణాలకు పట్టణాల నుండి నగరాలకు లక్షలాదిమంది ఓటర్లు పౌరులు ఉద్యోగ ఉపాధి రీత్యా వలసలు వెళుతున్న పరిస్థితులలో ప్రత్యేక ఓటరు నమోదులో తప్పిపోయే ప్రమాదం కూడా పొంచి ఉందని ఓటర్ ఫామ్స్ నింపడానికి సరైన అవగాహన లేని ఓటర్లు అత్యధికంగా ఉన్న మన సమాజంలో ఎన్నికల సమయానికి పేదల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న "ఫోరం ఫర్ బెటర్" వరంగల్ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ ఓటరు చైతన్యం లేకపోవడం వల్ల జరిగే అనర్థాలు అవకతవకలు చోటు చేసుకుంటాయని పౌర సమాజం జాగ్రత్తగా సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థలను రాజ్యాంగ హక్కులను కాపాడడానికి అన్ని పౌర సంఘాలు చైతన్యంతో నిబద్ధతతో కృషిచేయాలని అన్నారు. బోగస్ ఓట్ల తొలగింపు ఒకే వ్యక్తికి రెండు లేదా మూడు ప్రదేశాలలో ఉన్న ఓట్ల తొలగింపు లాంటివి చేసినప్పటికీ వాస్తవిక ఓటర్లకు అన్యాయం జరగకూడదని ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడకూడదని అందులో పౌర సమాజమే ప్రముఖ పాత్ర పోషించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బొమ్మినేని పాపిరెడ్డి, బి.సి ముస్లిం అసోసియేషన్ నాయకులు డాక్టర్ రాజ్ మహ్మద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వీరమల్ల బాబురావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, శాంతి సంఘం నాయకులు దొమ్మాట ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గుట్టలో పలు హోటళ్లలో అధికారుల ఆకస్మిక తనిఖీ..

**యాదగిరిగుట్ట, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరి గుట్ట పట్టణ పరిధిలో మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ పలు హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడుతున్న హోటళ్లపై ఫైన్ వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, వినియోగదారులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# సర్ ప్రోగ్రాంను పరిశీలించిన కలెక్టర్



**నల్లబెల్లి జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రోగ్రాంను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పరిశీలించారు. మంగళవారం నల్లబెల్లి గ్రామంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రోగ్రాంను కలెక్టర్ పరిశీలించి, 24.07.2026 రోజు నాటికి గ్రామాలలోని ఓటర్లందరూ సంబంచిన ఏనుమరేషన్ పత్రాలను బూత్ లెవెల్ అధికారులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చివరి తేదీ లోపు బిఎల్వోలు గ్రామాల్లోని ఓటర్ల పత్రాలను ఆన్లైన్లో నమోదు చేయాలనీ, అర్హులైన ఓటర్లను ఓటర్ జాబితాలో నమోదయ్యేలా చూడాలని సూచించారు. అనర్హులైన ఓటర్లను, చనిపోయిన వారి ఓటును తొలగించాలన్నారు. శాశ్వతంగా ఊరు విడిచి వెళ్లిన వారిని, డబుల్ ఓటర్లను తొలగింపు జాబితాలో చేర్చాలని ఆదేశించారు. మండలంలోని అందరు ఓటర్లు మీకు అందించిన ఏనుమరేషన్ ఫారాలను బూతు లెవెల్ అధికారి సూచనల ప్రకారం పూరించి, ఫారాలను బూత్ లెవెల్ అధికారికి తప్పక అప్పగించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.ఉమారాణి, డిపిఆర్ఓ ప్రేమలత, తహసిల్దార్ ముప్పు కృష్ణ, నర్సంపేట తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి, స్థానిక ఎస్సై సాయి ప్రసన్న కుమార్, గిర్దవారి కృష్ణస్వామి, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం సమాచార హక్కు చట్టం

- సమాచారం అడగడం ప్రతి పౌరుడి హక్కు
- అదనపు కలెక్టర్ మధుమోహన్



**గద్వాల, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని, సమాచారాన్ని అడగడం ప్రతి పౌరుడి హక్కు అని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి సమాచార హక్కు చట్టం సమన్వయ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మూడు నెలలకోసారి ఆయా శాఖలకు వచ్చిన ఆర్టీఐ దరఖాస్తులు, వాటి పరిష్కార స్థితి, పెండింగ్ వివరాలపై రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌కు నివేదిక పంపాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు నిబంధనల ప్రకారం పౌరులు కోరిన సమాచారాన్ని నిర్దేశిత గడువులో అందించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వివిధ శాఖల సమాచారాన్ని కోరే పౌరుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా వ్యవహరించాలని ఆదేశించారు. పౌరులకు అందిస్తున్న సేవలపై ప్రతి అధికారి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని, సమాచార హక్కు చట్టంలోని ముఖ్యమైన సెక్షన్లను అధికారులకు వివరించారు. అనంతరం వివిధ శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం, పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఆర్టీఐ సెక్షన్ పర్యవేక్షకురాలు సరితా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన వ్యవసాయ సేవలు అందాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**గద్వాల, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** గద్వాల నియోజకవర్గంలోని గద్వాల మండలం అనంతపురం స్టేజీలో ఏర్పాటు చేసిన హక ఫార్మర్ సర్వీస్ రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మంగళవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ సేవలు అందుబాటులో ఉండేలా రైతు సేవా కేంద్రాలు పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. కేంద్రం నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, నాయకులు రమేష్ నాయుడు, నరసింహారెడ్డి, రాంబాబు గౌడ్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన డిఎస్పి



**గద్వాల, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ధరూర్ మండలం ర్యాలంపాడు ఆర్అండ్ఆర్ సెంటర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను గద్వాల డీఎస్పీ మొగులయ్య మంగళవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి హాజరుకానున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలతో పాటు భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు డీఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. పరిశీలనలో ధరూర్ మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకట్రామ్ రెడ్డి, సత్య రెడ్డి, మాజీ ఎంపీటీసీ భీమ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం పురుషోత్తం రెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు, పోలీసు సిబ్బంది, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు గ్రీన్‌సిగ్నల్

- సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు



**గద్వాల, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :** తుమ్మిళ్ల లిఫ్ట్ పథకం కింద మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డా. ఎస్.ఏ. సంపత్‌కుమార్ కృషిని అభినందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన ఫైలు సిద్ధమైందని, భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌లో సూచించినట్లు సంపత్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, సంపత్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఏనముల నాగరాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్. రెడ్డి, రాజోలి మండల అధ్యక్షుడు దస్తగిరి తదితరులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయమైన పరిహారం అందించి రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్పల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో మాటు కాలువ శుభ్రం

**నిజామాబాద్, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**



ధర్పల్లి మండల కేంద్రంలో విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలోని చెరువులోకి వచ్చే మాటు కాలువను శుభ్రం చేశారు. ఎన్నో రోజులుగా చెత్తాచెదారంతో కూడుకుని ఉన్న మాట కాలువను గ్రామా అభివృద్ధి కమిటీ సభ్యులు దానిని గుర్తించి కాలువలోని చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను, కాల్వలో పేరుకుపోయిన చెత్తను జెసిపి సహాయంతో శుభ్రం చేయించారు.వర్షాకాలంలో వచ్చే నీరు కాలువ నుండి అధికంగా వస్తుందని చెత్త చెదారం వల్ల నీళ్లు వృధా గ పక్క కు వెళుతున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలోఅభివృద్ధి కమిటీ చైర్మన్ ఆర్మూర్ రంజిత్, వీడీసీ సభ్యులు చిలుక సాయికృష్ణ, బంగారు గంగ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ కట్టుబడి ఉంది

**- ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్**

**ఖమ్మం, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**



వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఇన్‌చార్జి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ తెలిపారు. ఖమ్మం నగరంలోని పిస్తా హౌస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం తన కుమార్తె అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఒక వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం సంబంధిత రెస్టారెంట్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, వంటశాల నిర్వహణ, ఆహార భద్రత ప్రమాణాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలలో భాగంగా రెండు ఆహార పదార్థాల చట్టబద్ధ (యాక్ట్) నమూనాలను సేకరించి, విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ మాట్లాడుతూ, ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటిలో తేలిన ఫలితాల ఆధారంగా ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర ఆహార వ్యాపార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆహార వ్యాపార నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి విక్రయించడంతో పాటు, నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని, ఆహార భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.వినియోగదారులు ఆహారం తీసుకునే సమయంలో పరిశుభ్రత, నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నాసిరకం, కలుషితమైన లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఎటువంటి రాజీ లేకుండా ఫుడ్ సేఫ్టీ శాఖ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ పరిధిలో 6 వ వార్డు లో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ

**వైరా, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**



వైరా మున్సిపాలిటీ పరిధిలో ని 6 వ వార్డులో ప్రత్యేక ఓటర్ల సమగ్ర పునఃశ్చరణ సర్ కార్యక్రమం ఇంటింటికి వెళ్లి ఓటరుకు వివరాలను ఆన్లైన్ చేస్తున్నారు.వార్డు లోజరుగుతున్న ఈ కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని అప్లికేషన్లు ఆన్లైన్ చేశారని బిఎల్ఓ ను అడిగి తెలుసుకున్నారు. త్వరతగతిన్ పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఈ ప్రత్యేక ఓటర్ల సమగ్ర పునశ్చరణ కార్యక్రమంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని కోరారు. ఓటును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనే ఉందని, ఓటరు జాబితాలో ఏవైనా లోపాలు, సందేహాలు లేదాసవరణలుఅవసరమైతే సంబంధిత బియల్బిల్ఏలను సంప్రదించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఓటు ద్వారానే ప్రజాస్వామ్యంలో ప్రజల స్వరం ప్రతిధ్వనిస్తుందని పేర్కొన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీనాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వుంద్రు శ్యామ్ బాబు, 20వవార్డు కౌన్సిలర్ ఉంద్రువరలక్ష్మి , శ్యాంబాబు, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరి రామకృష్ణ, బి ఎల్ వో లక్ష్మి పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నిజామాబాద్, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**



ధర్పల్లి మండల కేంద్రం లో పూసిన భాస్కర్, మాదిగ రాజనర్సయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్ ఆర్ పి ఎస్ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణ జరిగింది ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి ఎమ్ ఆర్ పి ఎస్ ధర్పల్లి మండల ఇంచార్జ్ నక్క రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గత 31 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం, మాదిగ ఉపకులాల సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం రాజీలేని పోరాటం చేస్తోందని కొనియాడారు.పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ గారి నాయకత్వంలో ప్రారంభమైన ఈ ఉద్యమం, ఏ బి సి వర్గీకరణ సాధించుకున్నాం అంతేకాకుండా కులమత బేధం లేకుండా అన్ని వర్గాల కోసం శ్రీ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు చేసిన ఉద్యమాలు దేశ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన మరియు శాంతియుతమైన సామాజిక ఉద్యమాలలో ఒకటిగా నిలిచిందని గుర్తుచేశారు. అదేవిధంగా మనం సాధించుకున్న ఏబీసీ వర్గీకరణ దీనిని వినియోగించుకోవాలని మన పిల్లలు చదువుపై దృష్టి సారించాలని మంచి మంచి ఉద్యోగాలు సాధించాలని తెలిపారుఈ జెండా ఆవిష్కరణ మరియు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ స్థానిక నాయకులు,రాజా నర్సయ్య, పూసిన భాస్కర్,డ్రైవర్ నర్సయ్య తెడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు

# తాళ్ల రామడుగులో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం పాల్గొన్న

**-జిల్లా నాయకులు నక్క రాజేందర్ మాదిగ**



**నిజామాబాద్, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**

సిరికొండ మండల పరిధిలోని తాళ్ల రామడుగు గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం గ్రామం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మార్పీఎస్ మాదిగ దండోర జెండా ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమం తెడ్డు చిన్న గంగాధర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నక్క రాజేందర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూమాదిగ ఉపకులాల హక్కుల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక శక్తి ఎమ్మార్పీఎస్ అని కొనియాడారు. మూడు దశాబ్దాలుగా ఎందరో నాయకులు, కార్యకర్తల త్యాగాల పునాదులపై నిర్మితమైన ఈ సంఘం, ఎస్సీ వర్గీకరణ సాధించిందని అన్నారు సాధించిన ఏబీసీ వర్గీకరణను అందరూ వినియోగించు కోవాలని కోరారు ఎమ్ ఆర్ పి ఎస్ సిరికొండ మండల అధ్యక్షుడు మొట్టల దీపక్ మాదిగ, మాట్లాడుతూమహాత్మా జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, మంద కృష్ణ మాదిగ గారి నాయకత్వంలో నడుస్తున్న ఈ ఉద్యమాన్ని అన్ని గ్రామంలో మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఎమ్ ఆర్ పి ఎస్ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో తెడ్డు చిన్న గంగాధర్ మాదిగ తాటిపల్లి గంగాధర్ మాదిగ దర్శనం రాజలింగం మాదిగ పత్రి గంగాధర్ మాదిగ నక్క బాబు మాదిగ తాటిపల్లి నాగేంద్ర మాదిగ తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో వార్ రూం ను ప్రారంభించిన -నూతి సత్యనారాయణ గౌడ్




**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వార్ రూమ్ ను మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. టి పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ వార్ రూమ్ ను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ(సర్) ప్రక్రియ జరుతున్న తరుణంలో క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని బూత్ లెవెల్ ఏజెంట్లతో నిత్యం అందుబాటులో ఉంటూ దిశా నిర్దేశం చేయుటకు, అర్హులైన ప్రతి ఓటర్ ను జాబితాలో చేర్పించుటకు కృషి చేయుటకు, బూత్ లెవెల్ ఏజెంట్లకు నిత్యం ఫోన్లు చేస్తూ తగిన సలహా సూచనలు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహారావు, కిలారు అనిల్ కుమార్, కొట్టే రాజశేఖర్,దామా స్వరూప, నాయకులు వేల్పుల మురళి, భవాని, ప్రతిభారెడ్డి,నీలవేణి, పద్మ,పంది రాజు గౌడ్, కుక్కల రామకృష్ణ, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ముచ్చింతల్‌లో 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ'ని దర్శించుకున్న

# తెలంగాణ గవర్నర్ సతీమణి

**రాజేంద్రనగర్, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**



తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సతీమణి జానకి శుక్లా ఈరోజు ఉదయం హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్‌లో కొలువై ఉన్న 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ'నీ స ంద ర్శించారు. ఈ సందర్భంగా ఆమె శ్రీ రామానుజాచార్యుల విగ్రహాన్ని భక్తిశ్ర ద్ధ ల తో ద ర్శించుకున్నారు. ఆ ల య ప్రాంగణంలోని 108 దివ్య దేశాలను,ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆమె ప్రత్యేకంగా పరిశీలించారు.ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికి,రామానుజాచార్యుల విశిష్టతను,ఈ క్షేత్రం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ ఆధ్యాత్మిక పర్యటనలో ఆమె శ్రీ రామానుజాచార్యుల బోధనల పట్ల ఆసక్తిని కనబరిచారు.

### ప్రత్యేక ఓటరు జాబితా సవరణ విజయవంతానికి
# అందరూ సహకరించాలి
## - శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపు





**వికారాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో బూతు స్థాయి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు.మంగళవారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై మున్సిపాలిటీ బూతు స్థాయి ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ, ఓటు హక్కుకు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, బూతు స్థాయి ప్రతినిధులు, యువత, అధికారులు సమిష్టిగా పని చేయాలని సూచించారు.గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, బూతు స్థాయి ప్రతినిధులు, బూతు స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఉపాధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి, శిక్షణ సమన్వయకర్త చైతన్య కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, బూతు స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శీతల పండగ



**ఏన్కూర్, (జర్నలిస్ట్ ఫైల్) :** బంజారా గిరిజనులు ఆషాడ మాసం పునర్వసు కార్త సందర్భంగా "శీతల భవాని" పండుగను ఏన్కూర్ మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడి పశువులు వృద్ధి చెందాలని, పంటలు బాగా పండాలని, వ్యాధుల బారిన పడకుండా ఉండాలని కోరుకుంటూ ఈ పండగను జరుపుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువకులు, డప్పు చప్పులకు నృత్యం చేస్తూ భక్తి శ్రద్ధలతో ఈ పండగను వైభవంగా నిర్వహించారు

# విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం
## —వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్.



**వరంగల్, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**

పోలీసులు తమ విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం సొంతం చేసుకోవడం ఎంతో కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను మంగళవారం పోలీస్ కమిషనర్ మామూనూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో ప్రారంభించారు.భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం పోలీస్ కమీషనరేట్, మహబూబాబాద్ మరియు భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది డ్యూటీ మీట్ లో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్, హ్యాండ్లింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ & వీడియో గ్రఫీ వంటి విభాగాల్లో సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.ప్రతి విభాగంలో ప్రతిభ కనబర్చిన వారిని, త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ కోసం ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్‌లు అధికారులకు తమ నైపుణ్యాలను మెరుగుపర్చే అవకాశం కల్పిస్తాయి. నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీ లు బాలస్వామి, శ్రీనివాస్ తో పాటు జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ ని కలిసిన డోంకేశ్వర్ మండల సర్పంచ్ లు



**నిజామాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళవారం నిజామాబాద్ కలెక్టరేట్లో డీఎంహెచ్ఓ రాజశ్రీ ని డోంకేశ్వర్ మండల సర్పంచులు కలిసి డోంకేశ్వర్ లో గల ప్రభుత్వ ఆసుపత్రిలో మండల ప్రజలకు 24 గంటల సేవలు అందించాలని సర్పంచులు కోరడమైనది.ఈ కార్యక్రమంలో డోంకేశ్వర్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బట్టు సంజీవరాజ్,సర్పంచులు సురకంటి రాజారెడ్డి,అల్లారి గంగాధర్,నాయకులు దశరథ్,భూమన్న,మహేష్ లు ఉన్నారు.

# పోలీస్ ప్రజావాణిలో 32 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ డీజీపీ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కుల్కచర్ల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బండెన్కిచర్ల గ్రామంలో సురక్షా మిత్ర కార్యక్రమంతో పాటు సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు సురక్షా మిత్ర కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచడం, పోలీసులకు సమాచార సహకారం అందించడం, గ్రామ స్థాయిలో నేరాల నివారణలో సురక్షా మిత్రల పాత్ర కీలకమని తెలిపారు.అలాగే ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు, ఓటీపీ మోసాలు, కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసాలు, ఫేక్ లింకులు, క్యూ ఆర్ కోడ్ స్కామ్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడులు–ట్రేడింగ్ మోసాలు, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్, నకిలీ కస్టమర్ కేర్ కాల్స్, లోన్ యాప్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎవరితోనూ ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.గ్రామ స్థాయిలో పోలీస్–ప్రజల సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా సురక్షా మిత్ర వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపుల ద్వారా సైబర్ భద్రత, నేరాల నివారణ, ప్రజా భద్రతకు సంబంధించిన అత్యవసర సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయనున్నట్లు తెలిపారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే గోల్డెన్ అవర్‌లో స్పందించడం అత్యంత కీలకమని, ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అలాగే సమీప పోలీస్ స్టేషన్‌ను వెంటనే సంప్రదించాలని కోరారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, సురక్షా మిత్ర కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పోలీసులకు సహకరించాలని కుల్కచర్ల పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# తీవ్ర పని ఒత్తిడితో సింగిల్ విండో' సీఈఓ గుండెపోటుతో ఆకస్మిక మృతి



**వైరా, జూలై 08 (జర్నలిస్ట్ ఫైల్) :**

గ్రామీణ రైతులకు, వ్యవసాయ రంగానికి అహర్నిశలు సేవలందించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్ విండో ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ, కార్యదర్శి) తీవ్ర గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అటు ప్రభుత్వ అధికారుల నిర్దేశిత టార్గెట్లు, ఇటు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, లోన్ రికవరీల ఒత్తిడి కారణంగా ఆయన తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది. విధులు ముగించుకుని

ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో భార్య అర్చన, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ఆయన తుదిశ్వాస విడిచారు.

**ఊపిరి సల్పని విధులు.. ప్రాణాలు తీస్తున్న ఒత్తిళ్లు**

సహకార సంఘాల సిబ్బంది పరిస్థితి ప్రస్తుతం 'కత్తి మీద సాము'లా మారింది. నాలుగు విభిన్న ప్రభుత్వ శాఖల (సహకార, వ్యవసాయ, పౌరసరఫరాల, బ్యాంకు అధికారులు) సమన్వయంతో పాటు, స్థానిక రాజకీయ ఒత్తిళ్ల నడుమ వీరు నలిగిపోతున్నారు. క్యాలెండర్ నిండా సీజన్ల వారీగా టార్గెట్లు ఉండటం, ఏ ఒక్క రోజు కూడా వీకెండ్ సెలవు లేకుండా

విధులు నిర్వహించాల్సి రావడం వల్ల సిబ్బంది శారీరకంగా, మానసికంగా తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే విధి నిర్వహణలో నిరంతరం సతమతమవుతూ, సకాలంలో విశ్రాంతి లేకపోవడంతో గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని సహోద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్యాక్స్ సిబ్బంది దిగ్భ్రాంతి.. ప్రభుత్వం ఆదుకోవాలని వినతి**

సీఈఓ అకాల మృతి పట్ల తోటి సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది మరియు స్థానిక రైతాంగం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, నిబంధనల ప్రకారం విధులను సక్రమంగా నిర్వహించే ఒక సమర్థుడైన అధికారిని కోల్పోవడం సహకార రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రభుత్వం మరియు సహకార శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉన్న అదనపు పని భారాన్ని మరియు మానసిక ఒత్తిడిని తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, మరణించిన సీఈఓ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మృతుడి భౌతిక కాయానికి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సహకార సంఘాల నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జూలై 21,22 న "మన ఇల్లు - మన లోకేష్" రెండో విడత ఇళ్ళ పట్టాల పంపిణీ



- మంత్రి నారా లోకేష్ చొరవతో మరో 3 వేల పేద కుటుంబాలకు సొంతింటి హక్కు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ చొరవతో అమలు చేస్తున్న "మన ఇల్లు – మన లోకేష్" కార్యక్రమం రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీ ఈ నెల 21, 22 తేదీలలో మంగళగిరి బైపాస్ సీకే కన్వెన్షన్ వేదికగా ఘనంగా నిర్వహించనున్నారు.
రెండో విడతలో భాగంగా సుమారు 3 వేల పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులతో పాటు, తాడేపల్లి స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా నివాసాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు కూడా ఈ విడతలో ఇళ్ల పట్టాలు అందజేయనున్నారు.
వాస్తవానికి ఈ కార్యక్రమం ఈ నెల 4, 5వ తేదీలలో నిర్వహించాల్సి ఉండగా, మంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియా పర్యటన కారణంగా వాయిదా పడి, ఇప్పుడు జూలై 21, 22 తేదీలకు ఖరారైంది.
పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుంటూ "మన ఇల్లు -- మన లోకేష్" కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. రెండో విడతలో వేలాది కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపనున్నారు.

## కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు తమ సమస్యలు, ప్రజా అంశాలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన సూచనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అదేవిధంగా ముదిరాజు కమ్యూనిటీ నిర్మాణం చేపట్టిన రామాలయానికి లక్ష రూపాయలు తన చేతుల మీదుగా రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ కి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గళ్ళా మాధవి చేతుల అందజేయడం జరిగింది.
అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని డివిజన్ అధ్యక్షులకు సూచించారు.

## ఈసీఐ నెట్ యాప్ డౌన్లోడ్ చేసుకోండి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఎన్నికల కమిషన్ రూపొందించిన ఈసీఐ నెట్ యాప్ డౌన్లోడ్ చేసుకుని స్వయంగా ఓటరు గా నమోదు కావచ్చని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక ఓటర్ సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు.
జిల్లాలో ఓటర్లు అందరికీ ఎన్యూమరేషన్ ఫారాలను అందించడం జరిగిందని చెప్పారు. సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ కూడా వేగంగా జరుగుతుందని చెప్పారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓ ల పట్ల క్రమశిక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పారు. ఎక్కువ మంది బిఎల్వోలు క్రియాశీలకంగా పనిచేస్తూ ఉత్తమ పని తీరును కనబరుస్తున్నారని అన్నారు. ఉదయం 6 గంటల నుండి తమ విధులను అంకితభావంతో నిర్వహించడం గమనార్హమని తెలిపారు. 2002 సంవత్సరం నాటి ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. 2002 సంవత్సరం ఓటరు జాబితాలో లేనప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంబంధిత వివరాలను పక్కాగా అందించడం వలన ఓటరుగా కొనసాగుతారని అన్నారు. ఏన్యుమరేషన్ ఫారాలలో వివరాలను ఓటరు నింపి, సంతకం చేసి ఇవ్వాలని అన్నారు. జూలై 14వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు.

## ఉద్యమ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలెన్నో



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్) :** కాకుమాను మండలం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాంపు అవగాహన మరియు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ను ది ఆర్ డి ఎ కాకుమాను మండలం ఎ పి ఎం సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎవరైతే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవాలని చేసుకోవడానికి అవకాశం ఉన్న వాళ్ళందర్నీ ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ చేపించినారు . ఈ కార్యక్రమానికి జిల్లా మార్కెటింగ్ అసోసియేట్స్ పద్మ శాంతి హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగ తహసిల్దార్ బి వెంకట స్వామి హాజరై మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రోగ్రాం గురించి అవగాహన కల్పించారు. జిల్లా స్త్రీ నిధి డీజిఎం ధర్మేంద్ర శ్రీనిధి ఏజీఎం వెంకటరమణ మాట్లాడుతూ స్త్రీ నిధి పై గ్రౌండింగ్ మరియు రికవరీ గురించి తెలియజేసారు. అదే విధంగా జిల్లా నుంచి డిజిటల్ గ్రీన్ ఎన్జీవో సంస్థ నుంచి మస్తాన్వలి మాట్లాడుతూ రైతు మిత్ర సంఘాల గురించి దాని ప్రత్యేకత గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సిబ్బంది మండల సిబ్బంది మండల సమాఖ్య ఈసీ మెంబర్స్ మరియు మండలంలోని వివోఏ లు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ స్థలంలో శాశ్వత అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే నసీర్

- వాకింగ్ ట్రాక్, క్రీడా ప్రాంగణం నిర్మాణం
- రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతోపాటు పీఎంకేజేవై ద్వారా వసతుల కల్పన
- జీజీహెచ్ కు అనుసంధానంగా మరికొన్ని విభాగాల ఏర్పాటు
- గత వైసీపీ పాలనలో వెల్ఫేర్ స్థలం అన్యాక్రాంతం
- ప్రజల ఆస్తుల పరిరక్షణపై రాజీ లేదు
- వెల్ఫేర్ స్థలాన్ని పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, నగర కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బొంగరాలబీడు ప్రాంతంలోని వెల్ఫేర్ స్థలంలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం నగర కమిషనర్ మయూర్ అశోక్ తో కలిసి ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. సంబంధిత స్థలంలో పనులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గానికి తలమానికంగా ఉండేలా వెల్ఫేర్ స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ స్థలాన్ని గత వైసీపీ పాలకులు అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నించారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడటంతోపాటు ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగపడేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అందులో భాగంగా ఏడు ఎకరాల వెల్ఫేర్ స్థలంలో కొంత భాగాన్ని గుంటూరు ప్రభుత్వాస్పత్రికి అనుసంధానంగా వివిధ విభాగాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం 80 సెంట్ల స్థలంలో ప్రజల అభీష్టం మేరకు వాకింగ్ ట్రాక్ నిర్మాణంతోపా క్రీడా హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్ లు కూడా సిద్ధం చేశామని తెలిపారు. వెల్ఫేర్ స్థలానికి కొత్త కళ తీసుకొస్తూ ఎన్నడూలేని విధంగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన సంక్రాంతి సంబరాలు నిర్వహించామన్నారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణం నిర్మాణానికి రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతోపాటు పీఎంజేకేవై ద్వారా మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలోనూ శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఇప్పటికే గుంటూరు తూర్పులో రూ.350 కోట్ల విలువైన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వైసీపీ అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయంగా సద్విమర్శలను స్వాగతిస్తామని, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.
కార్యక్రమంలో కూటమి నాయకులు గోళ్ల ప్రభాకర్, ముప్పవరపు భారతి, మహంకాళి నరసింహారావు, బొంతల సాయి, కుమార్ గౌడ్, మల్లేశ్వరి, గుడిమెట్ల దయారత్నం, ఆనంద్, వంగర ఏడుకొండలు, అజహర్, అధికారులు పాల్గొన్నారు.

## రూ.28 లక్షల విలువైన ఫోన్లు బాధితులకు అప్పగించిన పోలీసులు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి బాధితులకు తిరిగి అందజేయడంలో గుంటూరు జిల్లా పోలీసులు మరోసారి తమ సమర్థతను చాటుకున్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సుమారు రూ.28 లక్షల విలువైన 140 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు ఐటీ కోర్ విభాగం ద్వారా సుమారు రూ.9 కోట్ల 80 వేల విలువైన 4,504 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అప్పగించినట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే వ్యక్తిగత, ఆర్థిక సమాచారం దుర్వినియోగం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వెంటనే సీఈఐఆర్ (జజు×=) పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి రుసుము లేకుండా మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు అందజేస్తున్నామని, అస్సాం, బీహార్, పంజాబ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా ఫోన్లను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.
సైబర్ నేరాల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే మోసాలు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, భారీ లాభాలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, లాటరీలు, గిఫ్ట్‌లు, క్యాష్‌బ్యాక్‌లు వంటి మోసపూరిత సందేశాలను నమ్మవద్దని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు, పాస్‌వర్డులను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.
మొబైల్ ఫోన్ల రికవరీలో విశేష కృషి చేసిన ఐటీ కోర్ సీఐ నిషార్ భాష, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుళ్లు శ్రీధర్, ఇమామ్ సాహెబ్, యాసిన్, అరుణ, మానసతో పాటు సీసీఎస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాను ఎస్పీ అభినందించారు.

## వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- పుట్టిన ఆడ శిశువు నుంచి వయోవృద్ధుల వరకు అందరికీ సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి కల్పిస్తాం
- జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లాలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహాలతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా వసతి గృహాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు.
బుధవారం ఉదయం గుంటూరు నగరంలోని మహిళా ప్రాంగణం, సఖి నివాస్, గిరిజన బాలికల వసతి గృహం, ప్రభుత్వ ఉద్యోగినిల వసతిగృహం, అనాధ పిల్లలు వసతి గృహం, మహిళా వయో వృద్ధుల వసతి గృహం, పరివార్తన భవన్ లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహాల భవనాల స్థితిగతులు, నివాస గదులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, వంటశాల, భద్రతా ఏర్పాట్లు, పరిసరాల పరిశుభ్రత, నిర్వహణ తదితర అంశాలను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి వసతి గృహం భద్రత, పరిశుభ్రత, సౌకర్యాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. అప్పుడే పుట్టిన ఆడ శిశువు నుంచి వయోవృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా, సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేలా అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనువైన స్థలం పరిశీలించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సైతం చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. వసతి గృహాల్లో ఎక్కడైనా మరమ్మత్తులు అవసరమైతే వాటిని వెంటనే చేపట్టాలని, భవనాల బలోపేతం, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్, ఫర్నిచర్, డ్రైనేజీ, వంటశాలల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైన భద్రతా చర్యలు, పరిశుభ్రమైన పరిసరాలు వంటి అంశాలను తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. ప్రతి వసతి గృహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నివాసితుల నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, ఐ సి డి యస్ పిడి ప్రసూన, ఎస్ సి కార్పొరేషన్ ఈడీ దుర్గాభాయ్, మహిళా శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, వసతి గృహాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ చొరవతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

- రూ.1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో రెండు అంతస్తుల భవనం నిర్మాణం, ప్రజల చిరకాల కోరిక నెరవేర్చనున్న నారా లోకేష్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరిలోని బాప్టిస్ట్‌పేట వద్ద ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ చొరవతో ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.
ప్రజలు ఎన్నో ఏళ్లుగా కమ్యూనిటీ హాల్ కోసం ఎదురుచూస్తుండగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంత్రి నారా లోకేష్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణంలోని తెనాలి ఫ్లైఓవర్ సమీపంలో సుమారు 12 సెంట్ల స్థలంలో రూ.1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో రెండు అంతస్తుల ఆధునిక ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు.
గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజల చిరకాల కోరిక నెరవేరడం సంతోషకరమని, దీనికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవే కారణమని అన్నారు.
మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ, మంగళగిరి లో ఎస్సీ వర్గానికి ప్రత్యేక కమ్యూనిటీ హాల్ లేకపోవడం లోటుగా ఉండేదని, ఇప్పుడు ఆ లోటు భర్తీ కావడం శుభపరిణామమని పేర్కొన్నారు.
బాప్టిస్ట్ సంఘం అధ్యక్షులు పాస్టర్ నందిగం వసంతరావు మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు, ఈ సందర్భంగా నారా లోకేష్ కు ధన్యవాదములు తెలిపారు.
మంగళగిరి పట్టణ కార్యదర్శి కొదమల సురేష్ (సైమన్) మాట్లాడుతూ, ఇచ్చిన హామీని త్వరగా అమలు చేసిన మంత్రి నారా లోకేష్‌కు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు పార్లమెంట్ టీడీపీ యస్సి సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు మాట్లాడుతూ, మంగళగిరి అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం ద్వారా స్థానిక ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు.
ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్‌పేట సంఘ పెద్దలు నందిగం వసంతరావు, కలకోటి దేశీయ, కంతేటి రఘు, ప్రాతూరి ప్రేమ్‌కుమార్, కలకోటి సుబ్బారావు తో పాటు అధికారులు డీఈ రమేష్, ఎస్సీ లీలా ప్రసాద్, ఏఈ ప్రవీణ్, అమిరిశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్వీ శేషగిరి, టీడీపీ నాయకులు రంగిశెట్టి నరేంద్ర (బాబి), మాతంగి రవికిరణ్, బుల్లా రాము, బుల్లా పిచ్చయ్య, రావూరి విజయానంద్, కౌతరపు శ్రీనివాసరావు, నూతక్కి జోసెఫ్, వడ్డేశ్వరం రమేష్, కట్టిపోగు నాగేశ్వరరావు, కట్టిపోగు సీమోను, కలకోటి శ్యామ్సన్, చిలుకా ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో ఆధునిక హంగులతో జంక్షన్ల అభివృద్ధి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన జంక్షన్లను ఆధునిక హంగులతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం కాకాని రోడ్ వై జంక్షన్, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్, పాత గుంటూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జంక్షన్, జిన్నా టవర్, జీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న జంక్షన్, హిందూ కాలేజీ సెంటర్, నాజ్ సెంటర్, చుట్టుగుంట, కలెక్టరేట్ జంక్షన్‌లను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్), నగర పాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి పరిశీలించారు.
గుంటూరు రాష్ట్ర రాజధాని ప్రాంతంలో భాగంగా ఉన్నందున నగరంలోని జంక్షన్లు, పార్కులు, సెంట్రల్ డివైడర్లు, అవెన్యూ ప్లాంటేషన్‌లను ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ఏపీయూఐఏఎంఎల్ రూపొందించిన ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలు చేశామని, తుది డిజైన్లను త్వరగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జంక్షన్లలో ఆధునిక లైటింగ్, గ్రీనరీ, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్ సిగ్నల్స్, సైన్‌బోర్డులు, వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేసి నగర సౌందర్యాన్ని పెంపొందించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో ట్రయల్ నిర్వహించాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో నగర పాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు, ఏపీయూఐఏఎంఎల్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జన్మదిన వేడుకలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలిలో మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జన్మదిన వేడుకలు మండల వైఎస్ఆర్సిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోహార్ వైయస్సార్, జగన్మోహన్ రెడ్డి నాయకత్వం , అవినాష్ రెడ్డి ,శెట్టిపల్లి రఘురామిరెడ్డి, నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఆ మహానేత గురించి గుర్తుచేసుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల ఉప అధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి మైదుకూరు నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు బండి సుబ్బరాజ, వైఎస్ఆర్సిపి మండల యువ నాయకుడు పసుపులేటి వెంకటేష్, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ యత్తపు సుదర్శన్ రెడ్డి, మండల వైఎస్ఆర్సిపి నాయకులు బి.ఎస్ నారాయణరెడ్డి, మండలం వైఎస్ఆర్సిపి నాయకులు తిప్పన నాగార్జున నాయుడు, సోమయ్య, చంద్ర ఓబుల్ రెడ్డి, భూమిరెడ్డి రమణారెడ్డి, గంగిరెడ్డిపల్లి కృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, రామ మోహన్ రెడ్డి, భూమిరెడ్డి గంగిరెడ్డి, ముత్యాల రామచంద్రారెడ్డి, సిద్ధారెడ్డి ,నరసింహా రెడ్డి, ధర్మిశెట్టి వీర, మల్లికార్జున రెడ్డి మండల ఉప యువ నాయకులు రమ శీను, యువ నాయకులు ప్రభాస్ , జగదీష్, చెన్నకేశవరెడ్డి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఆంధ్రప్రదేశ్‌లో బాక్సింగ్ అకాడమీ ఏర్పాటుకు అడుగులు

- దిల్లీలో బాక్సర్ విజేందర్ సింగ్‌తో మంత్రి రాంప్రసాద్ రెడ్డి భేటీ
- బాక్సింగ్ అభివృద్ధిపై విజేందర్ సింగ్‌తో మంత్రి చర్చలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు లక్ష్యంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో ప్రముఖ భారత మాజీ బాక్సర్ విజేందర్ సింగ్ బనీవాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో బాక్సింగ్ క్రీడాభివృద్ధి, యువతకు ప్రపంచస్థాయి శిక్షణా అవకాశాలు కల్పించడం, అకాడమీ స్థాపనకు సంబంధించిన అంశాలపై ఈ సందర్భంగా వారు చర్చించారు.

## ఇన్ - సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ ఏర్పాటును ఆహ్వానిస్తున్నాం : ఏపీటీఎఫ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : 2011 ముందు డీఎస్సీ ల ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు జి. హృదయ రాజు, ఎస్. చిరంజీవి తెల్పారు. విద్యాహక్కుచట్టం 2010 నుండి అమలు కాబడిన సమయంలో 2010 ముందు టీచర్లకు టెట్ అవసరం లేకుండా ఉన్నింది. 2017 సం.లో కేంద్ర ప్రభుత్వం 2010 పూర్వం ఇన్ – సర్వీస్ టీచర్లు కూడా టెట్ పరీక్షలు పాస్ కావాలని సవరణ తేవడం, దాని ఆధారంగా సుప్రీమ్ కోర్టు తీర్పు వెల్లడించడం, ఇన్ సర్వీస్ టీచర్లలో ఆందోళన నెలకొని ఉన్నది. రిటైర్మెంట్ కు చివరి 5 సం. ల వారు తప్ప మిగతా వారు 2028 ఆగస్టు 31 లోపు పాస్ కావాలని తెలిపింది. ఏపీటీఎఫ్ పక్షాన టెట్ రద్దుకై సుప్రీమ్ కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం జరిగింది అని తెల్పారు.

ఈ క్రమంలో మరలా ఉద్యోగ అర్హత (టెట్) పరీక్ష రాయాలనే అంశాన్ని ఉపాధ్యాయ సంఘాలన్నీ వ్యతిరేకించడం జరిగింది. ఏపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య టెట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఐతే రద్దు చేసే లోపు ఇన్ – సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని కోరడం జరిగింది. ఆ మేరకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం. ఐతే దేశ వ్యాప్తంగా టెట్ రద్దు చేయాలని ఏపీటీఎఫ్, జాతీయ/ రాష్ట్ర స్థాయి వేదికల ద్వారా పోరాటాన్ని కొనసాగిస్తుందని తెల్పారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ పరీక్షను ఆఫ్లైన్ లో పెట్టాలని, సంబంధిత సబ్జెక్టులో మాత్రమే ప్రశ్నలు ఇవ్వాలని, అర్హత మార్కులు అందరికీ 40 మార్కులు (డిపార్ట్మెంటల్ టెస్టులలో పాస్ మాదిరి) ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ పక్షాన విద్యా శాఖను కోరడం జరిగింది.

## ఆర్టీసీ పరిరక్షణ ఉద్యమం ఉధృతం

- జేఏసీ-అధికారుల చర్చలు విఫలం
- నేటి నుంచి ప్రజాప్రతినిధులను కలవనున్న ఉద్యోగ సంఘాలు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపు మేరకు జూలై 7, 8 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన “ఆర్టీసీ పరిరక్షణ దినాలు” విజయవంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ఆర్టీసీ పరిరక్షణకు మద్దతు తెలిపారు. జూలై 9 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి ఉద్యమానికి మద్దతు కోరనున్నట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

బుధవారం ఆర్టీసీ హౌస్‌లో వీసీ అండ్ ఎండీ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో రెండు దఫాలుగా జరిగిన చర్చలు ఫలితం లేకుండా ముగిశాయి. విద్యాధరపురం, గుంటూరు–2, నెల్లూరు–2, మంగళం డిపోలను వెంటనే పునఃప్రారంభించడం, భవిష్యత్తులో వచ్చే విద్యుత్ బస్సులను పూర్తిగా ఆర్టీసీ ద్వారానే నిర్వహించడం, ఏ డిపోనూ ఖాళీ చేయకుండా సిబ్బంది బదిలీలు నిలిపివేయడం, 1,450 విద్యుత్ బస్సుల టెండర్లను రద్దు చేస్తూ వ్రాతపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ డిమాండ్ చేసింది. అయితే ఈ అంశాలపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వలేదని జేఏసీ పేర్కొంది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన నిర్ణయాలతోనే భవిష్యత్ చర్చలు జరగాలని, మొక్కుబడి సమావేశాలతో సమస్యలు పరిష్కారం కావని జేఏసీ అభిప్రాయపడింది. డిమాండ్ల పరిష్కారంలో జాప్యం కొనసాగితే ఉద్యమాన్ని దశలవారీగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది.

## ఇంజనీరింగ్ శాఖలు వేగం పుంజుకోవాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : ఇంజనీరింగ్ శాఖలు వేగం పుంజుకోవాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. సాంకేతికతను అందిపుచ్చుకుని పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఎం. పి లాడ్ పనులపైన, ఇతర నిధులతో మంజూరైన పనులపై సంబంధిత ఇంజనీరింగ్ శాఖలతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం. పి లాడ్ నిధులతో మంజూరై ప్రారంభం కాని నాలుగు పనులను తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. చేబ్రోలు, పొన్నూరు, తదితర ప్రాంతాల్లో రూ. 5 నుండి 15 లక్షల నిధులతో మంజూరైన పనులు వారం రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. చిన్న పనులు దీర్ఘకాలంగా చేపట్టడం పట్ల పనితీరును అంచనా వేయవచ్చని అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, తెనాలి మున్సిపాలిటి పరిధిలో జరుగుతున్న పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని అన్నారు. పర్యవేక్షక ఇంజనీర్ స్థాయిలో సమీక్షలు పక్కాగా నిర్వహించి ప్రగతి కనబరచాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు గుర్తించాలని, నిధులు విడుదల ఎప్పటికప్పుడు జరుగుతున్న సమయంలో పనుల జాప్యం జరగరాదని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద సౌర విద్యుత్ ఏర్పాటులో మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా విభాగాల్లో సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి. శ్రీనివాస్, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్. శ్రీనివాస మూర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ లు సి. హెచ్. రమేష్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

## సొంతిళ్లులా బీసీ గురుకులాలు, హాస్టళ్లు : మంత్రి సవిత



- 10 శాతం డైట్ ఛార్జీల పెంపు, రూ.500 కోట్ల సాస్కి నిధుల కేటాయింపుపై హర్షం
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం
- సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : అన్ని సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థుల డైట్ బిల్లులు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీ స్కూళ్ల శాశ్వత భవన నిర్మాణాలకు రూ. 500 కోట్ల సాస్కి నిధులు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీచేశారు. బీసీ బిడ్డల విద్య పట్ల సీఎం చంద్రబాబుకున్న చిత్తశుద్ధికి డైట్ ఛార్జీల పెంపుతో పాటు సాస్కి నిధులు మంజూరే నిదర్శనమన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి సవిత ఒక ప్రకటన చేశారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడు అన్ని సంక్షేమ శాఖ మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతమిస్తున్న డైట్ ఛార్జీలకు పది శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు కల్పించే ఉద్దేశంతో రూ. 500 సాస్కి నిధులు జారీచేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. ఈ నిర్ణయాలపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల దృష్ట్యా అన్ని గురుకులాలు, హాస్టళ్లలో అమలవుతున్న పది శాతం డైట్ ఛార్జీలు పెంచాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించే వీలుకలుగుతుందన్నారు. ముఖ్యంగా బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో వందల కోట్లు వెచ్చిస్తోందన్నారు. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం పెట్టిన రూ. 110 కోట్ల డైట్ బిల్లులను చెల్లించిందన్నారు. ఎప్పటికప్పుడు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తూ వస్తోందన్నారు.

**గురుకుల విద్యకు మరింత ప్రోత్సాహం** : ఎంజేపీ గురుకులాల అభ్యున్నతికి తమ అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. ఇటీవల ఆరు ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలను కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. కొత్తగా పది గురుకుల పాఠశాలలను మంజూరు చేశామన్నారు. ఇప్పుడు ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు కల్పించాలన్న లక్ష్యంతో రూ. 500 కోట్ల సాస్కి నిధుల మంజూరుకు సీఎం చంద్రబాబు ఆదేశించడం ఆనందకర విషయమన్నారు. డైట్ ఛార్జీల పెంపుతో సాస్కి నిధులు మంజూరుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేస్తూ, బీసీ బిడ్డల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ గురుకులాల్లో సొంతింటి కంటే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఎంజేపీ గురుకులాల్లో ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. బీసీ బిడ్డలు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం చంద్రబాబునాయుడు ఎన్ని కోట్లయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## టెలీమానస్ అప్రమత్తతతో నిలిచిన ఓ నిండు ప్రాణం

- ఆత్మహత్య యత్నాన్ని అడ్డుకున్న టెలీమానస్ హెల్ప్‌లైన్
- 14416కు ఫోన్.. మరణం అంచుల నుంచి బయటపడ్డ యువకుడు
- సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన వైద్య బృందం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : వ్యక్తిగత సమస్యలతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన 21 ఏళ్ల యువకుడి ప్రాణాలను వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న టెలీమానస్ (హెల్ప్‌లైన్–14416) సహాయ కేంద్రం సకాలంలో స్పందించి కాపాడింది. ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ అందించడంతో పాటు వెంటనే ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకోవడంతో యువకుడు చికిత్స పొందిన అనంతరం కోలుకుని క్షేమంగా ఇంటికి చేరాడు.

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన 21 ఏళ్ల యువకుడు వ్యక్తిగత కారణాలతో మంగళవారం ఉదయం ఎలుకల మందు తాగాడు. కొంతసేపటి తర్వాత ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందిన అతడు ఇంటర్నెట్‌లో వివరాలు వెతికి టెలీమానస్ హెల్ప్‌లైన్ 14416కు మంగళవారం రాత్రి ఫోన్ చేశాడు. కాల్ అందుకున్న విజయవాడ సర్వజన ఆసుపత్రిలోని టెలీమానస్ కేంద్రం వైద్యులు, కౌన్సెలర్లు అతడితో ప్రశాంతంగా మాట్లాడి ధైర్యం చెప్పారు.

అదే సమయంలో యువకుడి ద్వారా అతని తండ్రితో కూడా మాట్లాడిన వైద్య బృందం పరిస్థితిని వివరించి వెంటనే ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టింది. ఆసుపత్రిలో వైద్యులు అత్యవసర చికిత్స అందించి వాంతులు చేయించడంతో యువకుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అనంతరం ఆరోగ్యం మెరుగుపడి క్షేమంగా ఇంటికి చేరాడు.

యువకుడు కోలుకున్న అనంతరం బుధవారం ప్రొద్దుటూరులో తండ్రి, కుమారుడికి టెలీమానస్ సిబ్బంది మానసిక కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా మానసికంగా ధైర్యం కల్పిస్తూ అవసరమైన సూచనలు అందించారు.

ఈ ఘటనలో చొరవ చూపి యువకుడి ప్రాణాలను కాపాడిన విజయవాడ టెలీమానస్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీకాంత్, కౌన్సెలర్ షేక్, ప్రొద్దుటూరు జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (డీఎంహెచ్‌పీ) పరిధిలోని సైకియాట్రిస్ట్ డాక్టర్ కవితా ప్రసన్న, క్లినికల్ సైకాలజిస్ట్ కె. శిల్ప, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ పి. భాస్కర్‌లను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

మంత్రి మాట్లాడుతూ, మానసిక ఆందోళనలు, ఒత్తిళ్లు, ఆత్మహత్య ఆలోచనలు ఎదుర్కొంటున్న వారు సంకోచించకుండా టెలీమానస్ హెల్ప్‌లైన్ 14416ను సంప్రదించాలని సూచించారు. సరైన సమయంలో ఇచ్చే మానసిక కౌన్సెలింగ్ అనేక ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.1 లక్ష సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం అందజేత



**టెక్కలి(జర్నలిస్ట్ ఫైల్)** :టెక్కలి నియోజకవర్గానికి చెందిన పి. లక్ష్మమ్మ కుమారుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో, వారి కుటుంబానికి అండగా నిలుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ. 1,00,000 విలువైన చెక్కును బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో లక్ష్మమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మమ్మ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు సకాలంలో అందేలా చర్యలు కొనసాగుతాయని మంత్రి తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిన ఈ ఆర్థిక సహాయానికి పి. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ‘సంకల్పం’తో విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై చైతన్యం






- గుంటూరు, తెనాలిలో పోలీసుల అవగాహన కార్యక్రమాలు
- మహిళల భద్రతపై కూడా సూచనలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు గుంటూరు జిల్లా పోలీసులు చేపట్టిన ‘సంకల్పం’ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు నల్లపాడు, తెనాలి–1 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు.

నల్లపాడు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గోరంట్లలోని సెయింట్ ఆన్స్ కాలేజ్, చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజ్, బుడంపాడులోని జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కాలేజ్, పెద్దపలకలూరులోని ఎస్. ఆర్. జూనియర్ కాలేజ్‌లలో కళాశాల యాజమాన్యాల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 450 మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలను వివరించారు. అలాగే మహిళలపై జరిగే నేరాల నివారణ, మహిళల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అదే విధంగా తెనాలి–1 టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చిన్నరావూరు పార్కు సమీపంలోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ జూనియర్ కళాశాలలో ‘సంకల్పం––మాదకద్రవ్యాలకు వ్యతిరేక పోరాటం’ పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, చెడు స్నేహాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, సత్ప్రవర్తనపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు లేదా కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. విద్యార్థులు సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో ట్రాఫిక్ డీఎస్పీ బి. శ్రీనివాసరావు, నల్లపాడు సీఐ పి. భాస్కర్, తెనాలి–1 టౌన్ సీఐ రాంబాబు, పోలీసు అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’లో ప్రజలు భాగస్వాములు కావాలి: నగర కమిషనర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుంటూరు నగర పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)’ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం “ఇంటి నుంచే ఎన్యూమరేషన్” సదుపాయాన్ని ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఇటీవల నివాసం మార్చుకున్న వారు లేదా ప్రస్తుతం స్వస్థలానికి దూరంగా ఉన్నవారు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటికి వచ్చే వరకు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, ఓటర్లు తమ మొబైల్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో ఎపిక్ నంబర్, ఓటీపీ, ఈ–సైన్ ప్రక్రియతో వివరాలను నమోదు లేదా సవరించుకోవచ్చని తెలిపారు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే కొద్ది నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సమీప సచివాలయంలో అందజేస్తే ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత బీఎల్‌వోకు పంపేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా వార్డు వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఓటరు వెంటనే ఎన్యూమరేషన్ పూర్తి చేసి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## బీజేపీ స్వరం ప్రజల్లో మార్మోగాలి



- దుష్ప్రచార కుట్రలకు వాస్తవాలతో చెక్ పెట్టాలి
- బీజేపీ వాణి పదునెక్కాలి.. ప్రజల్లోకి బలంగా చేరాలి
- అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టుల వర్క్‌షాప్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో బీజేపీని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో కార్యాచరణ రూపొందిస్తున్నామని, అధికార ప్రతినిధులు పదునైన పదజాలంతో పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

బీజేపీ అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టుల కోసం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్, తెలుగు–సంస్కృత భాషా కార్పొరేషన్ చైర్మన్ ఆర్. డి. విల్సన్ హాజరయ్యారు. వర్క్‌షాప్‌కు వల్లూరు జయప్రకాశ్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ఇది అధికార ప్రతినిధులకు నిర్వహిస్తున్న రెండో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ అని తెలిపారు. రాష్ట్రంలో విద్రోహ శక్తులు వివిధ రూపాల్లో పనిచేస్తున్నాయని, దళితవాదం పేరుతో కొత్త ముసుగులు ధరించి హిందూ దేవతలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

మతాల పేరుతో చిచ్చు పెట్టడం, బలవంతపు మత మార్పిడులకు ప్రోత్సాహం ఇవ్వడం వంటి చర్యలను సమాజం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో అన్ని మతాలను గౌరవించి, రక్షణ కల్పించిన దేశం భారతదేశమేనని, అయినప్పటికీ దేశంపై కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.

వాక్ స్వాతంత్ర్యం పేరుతో విమర్శలు చేయడం వేరు, విద్వేషాలు రెచ్చగొట్టడం వేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, ఉగ్రవాదానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం, సామాజిక విద్వేషాలను ప్రేరేపించడం అంగీకారయోగ్యం కాదన్నారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుంటూనే పరమతాలను గౌరవించాలని, కుట్రపూరితంగా మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చైనాలో భావ ప్రకటనా స్వేచ్ఛ లేదని పేర్కొంటూ కమ్యూనిస్టు విధానాలను విమర్శించారు.

మోదీ–చంద్రబాబు నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వేగం తీసుకొచ్చిందన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలో భారీ ప్రాజెక్టులు అమలవుతున్నాయని, మూడు గ్రీన్ కారిడార్లు, ఎకనామిక్ కారిడార్లు, సోలార్ విద్యుత్ విస్తరణ, గూగుల్ డేటా సెంటర్, స్టీల్ ప్లాంట్ వంటి పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్తును మార్చనున్నాయని చెప్పారు.

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని, వచ్చే ఎన్నికల నాటికి పోలవరం జలకళతో కళకళలాడుతుందని తెలిపారు. మచిలీపట్నం పోర్టు అభివృద్ధి, అమరావతి నిర్మాణం, కడప స్టీల్ ప్లాంట్ వంటి ప్రాజెక్టులతో రాష్ట్రానికి భారీ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రెండేళ్లలో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని పేర్కొంటూ, అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను ప్రజలంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మంత్రి వై సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సానుకూల వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు కుల, మత విద్వేషాలను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. చట్ట పరిధిలో విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో సందేశాల ద్వారా కూడా విద్వేష ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు.

మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధం కావని తెలిసినా కొందరు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హిందూత్వ మూలాలను దెబ్బతీసేలా మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలు చేశారని, అమరావతి నుంచి మూడు రాజధానులు, ఇప్పుడు “మావిగన్” వంటి అసంబద్ధ వాదనలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి పార్టీలు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాయని, గ్రామీణ––పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధినే ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు. త్వరలో మూడు పార్టీల సమన్వయ సమావేశం నిర్వహించి అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ అధికార ప్రతినిధులు ప్రజా సమస్యలపై వాస్తవాధారితంగా స్పందించాలని, పార్టీ సిద్ధాంతాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467